www.vaarthavedhikasurya.com
RNI NO: TGTEL/25/A0305

# వార్త వేదిక సూర్య

తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY



ఆటో డ్రైవర్ల సంక్షేమానికి
## పోరాటం తప్పదు
7లో...

యాదాద్రి భువనగిరి | గురువారం 11, డిసెంబర్ 2025 | ఎడిటర్ : పోలోజు శ్రీనివాసచారి | సంపుటి : 01 | సంచిక: 200 | పేజీలు: 08 | వెల: 5/

# అగ్రస్థాయి స్టార్టప్స్‌లో గూగుల్ ఒకటి

- గూగుల్‌ది.. నేడు ప్రపంచస్థాయిలో అగ్రస్థానం
- సమిష్టి కృషికి ఇదో పెద్ద నిదర్శనం
- స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు వేల కోట్లు
- గూగుల్ ఫర్ స్టార్టప్ కేంద్రాన్ని ప్రారంభించిన సిఎం రేవంత్




హైదరాబాద్,డిసెంబర్10(వార్త వేదిక సూర్య): హైదరాబాద్‌లో ఉన్న అగ్రస్థాయి స్టార్టప్స్‌లో గూగుల్ ఒకటని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. మీరు యువకులు, శక్తివంతులు.. సాధారణంగా మీరు మీ కలలను సాకారం చేసుకోవాలనుకుంటారని పేర్కొన్నారు. బుధవారం టీ హబ్‌లో గూగుల్ స్టార్టప్ ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు రూ.వేల కోట్లు కేటాయిస్తున్నామని రేవంత్‌రెడ్డి అన్నారు. మూడు దశాబ్దాల క్రితం స్టార్టప్‌గా ప్రస్థానం ప్రారంభించిన గూగుల్.. నేడు ప్రపంచ స్థాయిలో నిలిచిందని చెప్పారు. ఆ సంస్థను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. టీహబ్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన గూగుల్ ఫర్ స్టార్టప్ కేంద్రాన్ని ఐటీ మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి సీఎం ప్రారంభించారు. హైదరాబాద్‌ను స్టార్టప్‌లకు కేంద్రంగా చేయనున్నట్లు రేవంత్ తెలిపారు. స్టార్టప్‌లు యూనికార్న్ స్థాయికి ఎదిగేలా ప్రణాళిక సిద్ధం చేసుకుని కృషి చేయాలని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సీఎం సూచించారు. ఉన్నత ఆశయాలతో 1998లో ఇద్దరు స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ మిత్రులు ఇద్దరు కలిసి కాలిఫోర్నియాలో ఒక గ్యారేజీలో ఓ స్టార్టప్‌ను ప్రారంభించారని తెలిపారు. అదే నేటి ప్రఖ్యాత గూగుల్ కంపెనీగా అవతరించిందని

మిగతా 2లో..



## యువర్ మనీ.. యువర్ రైట్

- అన్‌క్లెయిమ్డ్ మనీ సొంతం చేసుకోండి
- ప్రధాని మోడీ మరోమారు పిలుపు

న్యూఢిల్లీ,డిసెంబర్10 (వార్త వేదిక సూర్య): అన్ క్లెయిమ్డ్ ఆస్తు విషయంలో ఆర్‌బిఐ ఇటీవలే మార్గదర్శకాలను జారీ చేసింది. దీంతో ప్రజల్లో కొంత చైతన్యం వచ్చింది. ఇప్పుడు ప్రధాని మోడీ కూడా తనవంతుగా ప్రచారం మొదలు పెట్టారు. ఇది ప్రజలకు మేలు చేస్తుందన్న భావనలో ఆయన ప్రకటన చేశారు. క్లెయిమ్ చేయని ఆస్తుల గురించి ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం 'లింక్డిన్' ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. మరిచిపోయిన, క్లెయిమ్ చేయని నగదును దక్కించుకునేందుకు ఇది మంచి అవకాశమని పేర్కొన్నారు అందుకోసం 'మీ డబ్బు.. మీ హక్కు'మూమెంట్‌లో పాల్గొనాలని సూచించారు. భారతీయ బ్యాంకుల్లో రూ.78వేల కోట్లు, ఇన్సూరెన్స్ కంపెనీల్లో రూ.14 వేల కోట్లు, మ్యూచువల్ ఫండ్ కంపెనీల్లో రూ.3వేల కోట్లు, డివిడెండ్లు రూ.9వేల కోట్లు క్లెయిమ్ చేయకుండా ఉన్నాయని చెప్పారు. ఇటువంటి ఆస్తుల గురించి తెలుసుకునేందుకు సంబంధిత వెబ్‌సైట్లను ఆయన పంచుకున్నారు. ప్రతి పౌరుడు తనకు చెందిన సొమ్మును తిరిగి పొందేందుకే ఈ మూమెంట్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. మర్చిపోయిన ఆస్తులను కొత్త అవకాశంగా మార్చుకోండి. ఈ మూమెంట్‌లో భాగం కండి. ఈ ఆస్తుల వివరాలు ప్రజలను ఆశ్చర్యపరుస్తున్నాయి. ఏదిఏమైనప్పటికీ..

మిగతా 2లో..

# నేడే తొలి విడత పంచాయితీ పోరు

- ఎన్నికల నిర్వహణకు సర్వసిద్ధం
- తొలి విడతలో మొత్తం 189 మండలాలు
- 4,236 గ్రామపంచాయతీలు, 37,440 వార్డులు
- రాష్ట్రవ్యాప్తంగా 37,562 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు
- తొలి విడతలో ఓటేయనున్న 56,19,430 మంది ఓటర్లు
- గ్రామాల్లో భారీగా బందోబస్తు ఏర్పాటు
- ఉదయం 7 నుంచి 1 గంటవరకు పోలింగ్
- మధ్యాహ్నమే ఓట్ల లెక్కింపు...ఫలితం ప్రకటన
- వివరాలు వెల్లడించిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని

హైదరాబాద్,డిసెంబర్10(వార్త వేదిక సూర్య): తెలంగాణ రాష్ట్రంలో తొలి విడత గ్రామపంచాయతీ ఎన్నికలకు రంగం సిద్ధం అయ్యింది. ఇప్పటికే జోరుగా



ప్రచారం నిర్వహించిన అభ్యర్థులు నేటి ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. గతంలో ఎప్పుడూ లేనంతగా పంచాయితీ ఎన్నికల్లో పోటీ పెరిగింది. తెలంగాణలో తొలి దశ గ్రామ పంచాయతీ ఎన్నికల పోలింగ్ గురువారం జరగనున్నాయి. హైదరాబాద్‌లో ఎస్ఈసీ రాణి కుముదిని విలేకర్లతో మాట్లాడుతూ.. తొలి దశ పల్లె పోరుకు సర్వం సిద్ధం చేసినట్లు తెలిపారు. గురువారం ఉదయం 7.00 గంటల నుంచి ఈ పోలింగ్ ప్రారంభమవుతుందన్నారు. ఈ తొలి దశలో 56,19,430 మంది ఓటర్లు.. తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారని చెప్పారు.


ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని వెల్లడించారు. గురువారం జరగనున్న తొలి విడత సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరగేలా విస్తృత చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. తొలి విడతలో మొత్తం 189 మండలాలు, 4,236 గ్రామపంచాయతీలు, 37,440 వార్డులు ఎన్నికల పక్రియలో భాగంగా ఉన్నాయి. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 37,562 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయగా, తొలి విడతలో 56,19,430 మంది ఓటర్లు తమ ఓటు హక్కు

మిగతా 2లో..



## తొలివిడత పంచాయితీకి భారీ బందోబస్తు

- రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి వెల్లడి




హైదరాబాద్,డిసెంబర్10(వార్త వేదిక సూర్య): తెలంగాణలో గురువారం జరిగే మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు జిల్లాల పోలీస్ యంత్రాంగం

మిగతా 2లో..

# రాణిగంజ్ ఆర్టీసీ డిపోలో 65 ఎలక్ట్రిక్ బస్సుల ప్రారంభం

- నగరంలో 373 కొత్త కాలనీ రూట్లకు బస్సు సర్వీసులు
- దాదాపు 7 లక్షల మందికి సౌకర్యం
- రాజధాని నుండి గ్రామాల వరకు ఆర్టీసీని మరింత విస్తరిస్తాం
- ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తున్నాం
- ఎలక్ట్రిక్ బస్సుల ప్రారంభోత్సవంలో మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య): నగరంలో కాలుష్యాన్ని తగ్గించడానికి ఎలక్ట్రిక్ బస్సుల వినియోగాన్ని తెలంగాణ ఆర్టీసీ మరింత విస్తృతం చేస్తోంది. అందులో భాగంగా బుధవారం నగరంలో రాణిగంజ్ డిపో వేదికగా 65 ఎలక్ట్రిక్ బస్సులను రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. హైదరాబాద్ లోనే 2800 ఎలక్ట్రిక్ బస్సులు నడిపించాలని లక్ష్యంగా పెట్టుకున్నా ఆర్టీసీ దశల వారీగా బస్సులు ప్రవేశపెట్టనుంది. ప్రస్తుతం టీజీఎస్ ఆర్టీసీ మొత్తం తెలంగాణ రాష్ట్రంలో 810 ఈవీ బస్సులను నడుపుతోంది. వీటిలో 300 బస్సులు హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాల్లో తిరుగుతున్నాయి. ఈరోజు




65 ఈ-మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల ప్రవేశంతో పాటు, జనవరి చివరి నాటికి మరో 175 ఈవీ బస్సులు అందనున్నాయి. దీంతో నగరంలో మొత్తం 540 ఈవీ బస్సులు అందుబాటులోకి వస్తాయి. ఒక వైపు ఎలక్ట్రిక్ బస్సులు ప్రారంభించుకుంటూనే అంతే వేగంతో వాటి మౌలిక సదుపాయాలు ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు

మిగతా 2లో..




## యూనివర్సిటీల్లో 'ఇంక్యూబేషన్' సెంటర్లు

- 'గూగుల్ ఫర్ స్టార్టప్స్ హబ్' ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య): కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ యూనివర్సిటీల్లో 'ఇంక్యూబేషన్' సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్టు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. తెలంగాణను 'గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్'గా మార్చాలనే లక్ష్య సాధనలో తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్, లైఫ్ సైన్సెస్ హబ్ 'వన్ హబ్'కు దీటుగా ఈ కేంద్రాలను తీర్చి దిద్దుతామన్నారు. బుధవారం టీ హబ్ లో 'గూగుల్ ఫర్ స్టార్టప్స్ హబ్'ను సీఎం రేవంత్ రెడ్డితో కలిసి ఆయన లాంఛనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి

మిగతా 2లో..




## తెలంగాణ ఉద్యమంలో ఉస్మానియాదే కీలకం

- ఉస్మానియా వర్సిటీకి మహర్దశ
- వెయ్యికోట్లు విడుదలకు సీఎం రేవంత్ అంగీకారం
- వెంటనే విడుదలకు విద్యాశాఖ ఉత్తర్వులు
- అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధికి కంకణం
- ధైర్యంతో కాదు...గుండెనిండా ప్రేమతో ఇక్కడికి వచ్చా
- చదువు రాకున్నా..చదువు విలువ తెలిసినోడిని
- ఉస్మానియా సభలో సిఎం రేవంత్ భావోద్వేగ ప్రసంగం

హైదరాబాద్,డిసెంబర్10(వార్త వేదిక సూర్య): ఉస్మానియా విశ్వవిద్యాలయాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చి దిద్దాలనే సంకల్పంతో వచ్చానని సిఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. తెలంగాణ తొలి,మలి దశ ఉద్యమాలకు ఉస్మానియానే కేంద్రమని అన్నారు. ఎన్నో ఉద్యమాలకు ఇది వేదికగా

మిగతా 2లో..




## నైట్ క్లబ్స్, రెస్టారెంట్స్, హోటల్స్‌లో బాణసంచా నిషేధం

- గోవా ప్రభుత్వం సంచలన నిర్ణయం

పనాజి,డిసెంబర్10(వార్త వేదిక సూర్య): నూతన సంవత్సర, క్రిస్మస్ వేడుకలకు గోవా సిద్ధమవుతున్న తరుణంలో నైట్ క్లబ్ అగ్నిప్రమాద ఘటన కలకలానికి దారి తీసింది. ఈ ఘటనలో 25 మంది మృతి చెందడంతో ఆందోళన వ్యక్తం అవుతోంది. ఈ నేపథ్యంలో రానున్న హాలిడే సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని గోవా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని నైట్ క్లబ్స్, రెస్టారెంట్స్,

మిగతా 2లో..

## కేంద్ర సమచార, కేంద్ర విజిలెన్స్ కమిషన్ నియామకం

- ప్రభుత్వ ప్రతిపాదనలను విభేదించిన రాహుల్



న్యూఢిల్లీ,డిసెంబర్10(వార్త వేదిక సూర్య): కేంద్ర సమచార కమిషన్, కేంద్ర విజిలెన్స్ కమిషన్ వంటి పారదర్శక సంస్థలకు కీలక నియామకాలు ఖరారు చేయడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలోని ప్యానల్ బుధవారంనాడు నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశం ముగిసింది. ప్రధానమంత్రి మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాతో పాటు లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ కూడా పాల్గొన్నారు. సుమారు 88 నిమిషాల పాటు సమావేశం జరిగింది. రాహుల్ గాంధీ పీఎంఓ కార్యాలయానికి ఒంటిగంట సమయానికి చేరుకున్నారు. 1.07 నిమిషాలకు సమావేశం ప్రారంభమైంది. సమావేశానంతరం అత్యున్నత పదవులకు మోదీ ప్రతిపాదించిన పేర్లతో విభేదిస్తున్నట్టు రాహుల్ పేర్కొంటూ లిఖితపూర్వకంగా తన అసమ్మతి నోట్‌ను అందజేశారు. కాగా, ప్రస్తుతం సీఐసీలో ప్రధాన సమాచార కమిషనర్‌తో పాటు 8 కమిషనర్ల

మిగతా 2లో..

## విజన్ 2047లో భాగంగా ప్రజా రవాణాను 28 శాతం నుండి 70 శాతానికి పెంచాలి

- ప్రజా రవాణా మరింత ప్రజల్లోకి తీసుకెళ్లాలి ఆర్టీసీ ఉద్యోగులు మరింత కష్టపడాలి..
- ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కరిస్తాం...
- ఆర్టీసీ ఉద్యోగుల పిల్లలకు అధునాతన సౌకర్యాలతో ఆర్టీసీ స్కూల్ ఏర్పాటుకు కృషి చేస్తా
- సంస్థ పరిరక్షణ,ఉద్యోగుల సంక్షేమం, ప్రయాణికుల సౌకర్యం మా ప్రధాన లక్ష్యం
- మహాలక్ష్మి పథకం ప్రారంభమై రెండేళ్ళ పూర్తి చేసుకున్న సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులకు సిబ్బందికి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడిన మంత్రి పొన్నం ప్రభాకర్



7లో..

## త్వరలోనే పార్టీ పదవుల భర్తీని పూర్తి చేస్తాం..



- గ్లోబల్ సమ్మిట్‌తో ఊహించని విధంగా పెట్టుబడులు
- పేరెన్నిక గన్న కంపెనీలతో పలు ఒప్పందాలు
- ముందస్తు కార్యక్రమాలతోనే రాహుల్, ఖర్గేలు రాలేదు
- మీడియా సమావేశంలో పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్,డిసెంబర్10(వార్త వేదిక సూర్య): గ్లోబల్ సమ్మిట్‌తో ఊహించని స్థాయిలో తెలంగాణకు పెట్టుబడులు వచ్చాయని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ చెప్పుకొచ్చారు. పేరుగాంచిన కంపెనీలతోనే తమ ప్రభుత్వానికి

మిగతా 2లో..

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY


# రాణిగంజ్ ఆర్టీసీ డిపోలో 65 ఎలక్ట్రిక్ బస్సుల ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

జరుగుతుంది. ఈ 65 ఎలక్ట్రిక్ బస్సులు ప్రజా సౌలభ్యం కోసం సికింద్రాబాద్ - కొండాపూర్ - 14 బస్సులు, సికింద్రాబాద్ - ఇస్నాపూర్ - 25 బస్సులు, సికింద్రాబాద్ - బోరబండ - 8 బస్సులు, సికింద్రాబాద్ - రామాయంపేట - 6 బస్సులు, సికింద్రాబాద్ - గచ్చిబౌలి - 8 బస్సులు, సికింద్రాబాద్ - మేడియాపూర్ ఐ రోడ్డు - 4 బస్సులు నడవనున్నాయి

ఎలక్ట్రిక్ బస్సులు ప్రవేశపెట్టడంలో తెలంగాణ రాష్ట్రానికి దేశానికి ఆదర్శంగా నిలుస్తోంది. పర్యావరణ నిర్వహణ, కార్యాచరణ సామర్థ్యం, ఆధునిక ప్రజా రవాణాలో కార్పొరేషన్ ప్రమాణాలను నిర్దేశిస్తోంది. ఈ కొత్త ఎలక్ట్రిక్ బస్సులు ఆధునిక ప్రయాణికుల సౌకర్యాలతో, రియల్ టైమ్‌లో అమర్చబడి ఉంటాయి.ట్రాకింగ్, విశాలమైన సీటింగ్ మరియు మెరుగైన యాక్సెసిబిలిటీ ఫీచర్లు, మెరుగైన ప్రయాణ అనుభవాన్ని నిర్ధారిస్తాయి. రాణిగంజ్ డిపోలో ప్రారంభోత్సవం కేవలం కొత్త వాహనాల చేరికను మాత్రమే కాకుండా, తెలంగాణ పౌరుల పరిశుభ్రమైన భవిష్యత్తు వైపు అడుగును సూచిస్తుంది.ఈ అదనపు 65 ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టడం వలన నగరంలో శబ్ద స్థాయిలను తగ్గించడం, కార్బన్ ఉద్గారాలను గణనీయంగా తగ్గించవచ్చు. అధిక శక్తి సామర్థ్యం కారణంగా సంస్థపై తక్కువ నిర్వహణ ఖర్చులు అవుతాయి. శబ్ద రహిత, సున్నితమైన ప్రయాణంతో ప్రయాణీకుల సౌకర్యాన్ని మెరుగుపరచవచ్చు.

ఈ ఎలక్ట్రిక్ బస్సుల్లో రియల్ టైమ్ ట్రాకింగ్ కోసం ఇంటిగ్రేటెడ్ ఐటీఎస్ (ఇంటెలిజెంట్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్స్) ఉంటుంది.అగ్ని ప్రమాదాల గుర్తింపు, నిరోధక వ్యవస్థ (ఎఫ్‌డీఎస్‌ఎస్) ఏర్పాటు చేశారు. 36 సీట్లతో సౌకర్యవంతమైన సీటింగ్ సామర్థ్యం ఉంటుంది. ప్రయాణికుల సౌకర్యాలైన అనౌన్స్‌మెంట్ సిస్టమ్, రియల్-టైమ్ ట్రాకింగ్, డిజిటల్‌గా ప్రదర్శించబడిన గమ్యస్థాన బోర్డులు, యుఎస్‌బీ ఛార్జింగ్, వృద్ధులు, వికలాంగుల కోసం మోకాలి/ర్యాంప్‌లు అందుబాటులో ఉన్నాయి. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రవాణా శాఖ తరపున ఆర్టీసీ రాణిగంజ్ నుండి 65 బస్సులు ప్రారంభం చేసుకున్నామని తెలిపారు. బుధవారం నుండి నగరంలో 373 కొత్త కాలని రూట్లకు ఆర్టీసీ బస్సులు నడుపుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. ఇందుకోసం గత మూడు నెలలుగా కొత్త రూట్లపై సర్వే జరిగింది. దీని ద్వారా ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో దాదాపు 7 లక్షల మందికి అదనంగా



ప్రజా రవాణా సౌకర్యం ఏర్పడిందని పేర్కొన్నారు. హైదరాబాద్ ప్రజలకే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఎక్కడెక్కడ అవసరమున్నాయో స్థానిక ప్రజాప్రతినిధులు తెలియజేయాలని సూచించారు. ఐటీ కారిడార్ లో ఐటీ ఉద్యోగులు అవసరమైన బస్సులు నడిపించడానికి సిద్ధంగా ఉన్నామని సొంత వాహనాలు , క్యాబ్ లకు దూరంగా ఉంచడం వల్ల ట్రాఫిక్ ను తగ్గించవచ్చని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. రాజధాని నుండి గ్రామాల వరకు ఆర్టీసీ మరింత విస్తరిస్తామని పేర్కొన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కారం చేస్తున్నామని, ఉద్యోగ నియామకాలు పోలీస్ రిక్యూట్మెంట్ బోర్డు ద్వారా భర్తీ చేస్తున్నామని వెల్లడించారు. ప్రమాదాలను తగ్గించడానికి రవాణా శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు నిరంతరం తనిఖీలు చేస్తున్నాయని తెలిపారు.దేశంలో ఎక్కడ లేని విధంగా ఈవీ పాలసీ స్క్రాప్ పాలసీ తీసుకొచ్చింది. ఆర్టీసీ యాత్రదానం కార్యక్రమాన్ని విస్తృతం చేయాలని సూచించారు. ఇప్పటికే హైదరాబాద్, కరీంనగర్, నిజామాబాద్, నల్గొండ, సూర్యాపేట లలో ఈవీ బస్సులు నడుస్తున్నాయని పేర్కొన్నారు.

ప్రజా పాలన ప్రభుత్వం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మహా లక్ష్మీ పథకం ప్రారంభం చేసుకొని 2 సంవత్సరాలు పూర్తి చేసుకున్నామని, ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే ఆర్టీసీ లో ఉచిత ప్రయాణం ప్రారంభించుకున్నామని ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్, శ్రామిక్ ఇతర సిబ్బంది ఎంతో శ్రమిస్తున్నారని వారందరికీ అభినందనలు తెలిపారు. ఇప్పటికీ 251 కోట్ల మంది మహిళలు ఉచితంగా, 8,500 కోట్ల రూపాయల విలువైన ప్రయాణాన్ని చేశారని పేర్కొన్నారు.

ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలో ఇప్పుడున్న 40 శాతం బస్సులు కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఆర్టీసీ లో కొత్తగా డ్రైవర్లు, కండక్టర్ లు, శ్రామిక లు వస్తున్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా ఆర్టీసీ బస్సులను మహిళలను యజమానులను చేసిందని కొనియాడారు. ఆర్టీసీ సంస్థ పరిరక్షణ, ఉద్యోగుల సంక్షేమం, ప్రయాణికుల భద్రత అంశాలలో పని చేస్తుంది. ఆర్టీసీ నూతన బస్ డిపో ల ఏర్పాటు, బస్ స్టేషన్ ల అభివృద్ధి చేసుకుంటున్నామని తెలిపారు.

65 ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభం వల్ల నగరంలో ఆర్టీసీ మరింత విస్తృత సేవలు అందిస్తుందని ఎండీ నాగిరెడ్డి తెలిపారు.ప్రభుత్వం ఏర్పడిన రెండు సంవత్సరాల్లో 2400 కొత్త బస్సులు వచ్చాయని తెలిపారు. ఒక్కో ఎలక్ట్రిక్ బస్సు ప్రతి రోజు ఒక టన్ను కార్బన్ డై ఆక్సైడ్ తగ్గిస్తుందని నగరంలో ఎలక్ట్రిక్ బస్సుల వినియోగం వల్ల కాలుష్యాన్ని నియంత్రించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మేయర్ గద్వాల విజయ లక్ష్మీ, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత రెడ్డి, స్థానిక కార్పొరేటర్ సుచరిత రెడ్డి, ఈడి లు, ఇతర ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

# యువర్ మనీ.. యువర్ రైట్

(మొదటి పేజీ తరువాయి)

ఇవన్నీ ఎన్నో కుటుంబాలు కష్టపడి కూడబెట్టిన పొదుపు, పెట్టుబడులను సూచిస్తున్నాయని ప్రధాని తన పోస్టులో రాసుకొచ్చారు. ఇప్పటికే రూ. 2వేల కోట్ల విలువైన ఆర్థిక ఆస్తులను ఈ ఏడాది అక్టోబరు, నవంబరుల్లో అర్హులైన హక్కుదార్లకు అందించామని చెప్పారు. అనేక కారణాల వల్ల క్లెయిమ్ చేసుకోకుండా ఉన్న బ్యాంకు డిపాజిట్లు, బీమా, డివిడెండ్లు, షేర్లు, మ్యూచువల్ ఫండ్లు, పింఛన్ లాంటి ఆర్థిక ఆస్తులను సంబంధిత హక్కుదారులకు, చట్టబద్ధ వారసులకు అందించాలన్న లక్ష్యంతో 'యువర్ మనీ, యువర్ రైట్' కార్యక్రమాన్ని అక్టోబరు 4న దేశవ్యాప్తంగా ప్రభుత్వం ప్రారంభిం చింది. ఇందులోభాగంగా ప్రజాప్రతినిధులు, జిల్లా పాలనా అధికారులు, ఆర్థిక సేవల అధికారులతో అక్టోబరు నుంచి డిసెంబరు 5 వరకు 477 జిల్లాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటుచేసి.. ప్రజలకు అవగాహన కల్పించినట్లు రాజ్యసభలో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరీ ఇప్పటికే వెల్లడించారు. ఆర్థిక సంస్థల్లో ఉండిపోయిన తమ ఆర్థిక ఆస్తులను పొందేందుకు అనుసరించాల్సిన విధివిధానాలను తెలిపి, సందేహాలను పరిష్కరించడంతో పాటు పలు అంశాలపై అవగాహన కల్పించే విషయాలను ప్రధాన ప్రాంతీయభాషల్లోనే అందించామని వెల్లడించారు. తక్కువ సమయం నిడివితో వీడియో సందేశాల ద్వారా విస్తృతంగా ప్రచారం కల్పించామని మంత్రి తెలిపారు. ఆర్‌బీఐ, సెబీ, ఐఆర్‌డీఏఐ, పీఎఫ్‌ఆర్‌డీఏ, ఐఈపీఎఫ్ఏ లాంటి ఆర్థిక రంగ నియంత్రణ సంస్థలు ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నాయని వివరించారు. ప్రజలు తమ అన్÷-లకెయిమ్డ్ ఆర్థిక ఆస్తులను కనుగొనడంలో ఆర్‌బీఐ 'ఉద్గమ్', ఐఆర్‌డీఏఐ 'బీమా భరోసా', సెబీ 'మిత్రా' సమర్థంగా ఉపయోగపడుతున్నాయని మంత్రి తెలిపారు.

## నైట్ క్లబ్స్, రెస్టారెంట్స్, హోటల్స్‌లో
# బాణసంచా నిషేధం

(మొదటి పేజీ తరువాయి)

హోటల్స్‌లో బాణసంచాను నిషేధించింది. ముందస్తు జాగ్రత్తగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. సంప్రదాయక బాణసంచాతో పాటు ఎలక్ట్రానిక్ ఫైర్ వర్క్స్, నిప్పుతో చేసే ఇతర ప్రదర్శనలు, ఫైర్ గేమ్స్‌ను నిషేధించినట్టు గోవా ప్రభుత్వం వెల్లడించింది. క్రిస్మస్, న్యూఇయర్ వేడుకల నేపథ్యంలో గోవాకు పర్యాటకుల తాకిడి పతాకస్థాయికి చేరనున్న నేపథ్యంలో ముందుజాగ్రత్త చర్యగా ఈ నిషేధం విధించినట్టు వెల్లడించింది.డిసెంబర్ 6న జరిగిన నైట్ క్లబ్ అగ్నిప్రమాదం తరువాత పర్యాటక రంగంలో ఆందోళన రేకెత్తిన నేపథ్యంలో బుధవారం ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ బుధవారం ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో భద్రతా వ్యవస్థల బలోపేతం, నిబంధనల అమలుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఇటీవల నైట్ క్లబ్ అగ్నిప్రమాదం తరహా దుర్ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. అన్ని డిపార్ట్‌మెంట్‌లు, టూరిజం రంగ సంస్థలు ఈ విషయంలో సమన్వయంతో ముందుకు సాగాలని అన్నారు. ప్రమాదాలకు అవకాశం ఎక్కువగా ఉండే బీచ్‌లు, జలపాతాలున్న ప్రాంతాలు, పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో పరిస్థితులను నిశితంగా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా అగ్నిప్రమాద నివారణకు సంబంధించిన నిబంధనల విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అనుమతించిన వేళల్లోనే మద్యాన్ని విక్రయించాలని హోటల్స్, రెస్టారెంట్స్, క్లబ్స్, నైట్ క్లబ్స్‌ను ఆదేశించారు.

# కేంద్ర సమచార, కేంద్ర విజిలెన్స్ కమిషన్ నియామకం

(మొదటి పేజీ తరువాయి)

పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 30,838 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. దీనికి ముందు సీఐసీగా ఉన్న హీరాలాల్ సామరియా 65 ఏళ్లు పూర్తికావడంతో గత సెప్టెంబర్ 13న పదవీ విరమణ చేశారు. 2023 నవంబర్ 6న ఆయన సీఐసీగా నియమితులయ్యారు. కాగా, మే 21న సీఐసీ పోస్టుకోసం అడ్వర్‌టైజ్‌మెంట్ ఇవ్వడంతో 83 అప్లికేషన్లు వచ్చినట్టు డిపార్ట్‌మెంట్ ఆఫ్ పెర్సనల్ అండ్ ట్రైనింగ్ అధికారులు తెలిపారు. సీఐసీలోని సమాచార కమిషనర్ ఖాళీలకు 161 అప్లికేషన్లు అందినట్టు ప్రభుత్వం తెలిపింది. నిబంధనల ప్రకారం, సమాచార హక్కు చట్టంలోని సెక్షన్ 12(3) కింద చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ నియామకాలకు పేర్లను ప్రధాని సారథ్యంలోని కమిటీ ఎంపిక చేసి తమ సిఫార్సులను రాష్ట్రపతికి పంపుతుంది. రాష్ట్రపతి ఆమోదం పొందిన తర్వాత నియామక ఉత్తర్వులు జారీ అవుతాయి.

# యూనివర్సిటీల్లో 'ఇంక్యూబేషన్' సెంటర్లు

(మొదటి పేజీ తరువాయి)

శ్రీధర్ బాబు మాట్లాడుతూ.... మేం స్టార్టప్ లను కేవలం చిన్న కంపెనీలుగా మాత్రమే చూడటం లేదని, సమాజం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు వినూత్న పరిష్కారాలు అందిస్తూ.. కొత్త ఉద్యోగాలను సృష్టించే 'ఎకనామిక్ ఇంజిన్స్'గా చూస్తున్నామన్నారు. 2024 లో ఇక్కడి స్టార్టప్‌లు 571 మిలియన్ డాలర్ల నిధులను సమీకరించాయన్నారు. అంతకు ముందు ఏడాదితో పోలిస్తే ఇది 160 శాతం అధికమని వివరించారు. ముఖ్యంగా హెల్త్ టెక్ రంగంలో 2,139 శాతం వృద్ధి నమోదయ్యిందన్నారు. మహిళా నేతృత్వంలోని స్టార్టప్‌లలో హైదరాబాద్ దేశంలోనే ఆరో స్థానంలో ఉందన్నారు. 531 వుమెన్ లెడ్ స్టార్టప్ లు 417 మిలియన్ డాలర్ల నిధులను సమీకరించాయన్నారు. ఇవి కేవలం గణాంకాలు మాత్రమే కాదని, తమ ప్రభుత్వ పనితీరుకు, ప్రగతిశీల విధానాలకు నిలువెత్తు నిదర్శనమన్నారు. తమ ప్రభుత్వం టెక్నాలజీని కేవలం టూల్‌గా మాత్రమే చూడటం లేదని, ఒక సమానత్వ సాధనంగా చూస్తోందన్నారు. టెక్నాలజీ ఫలాలను రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ అందేలా చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. స్టార్టప్ లు, కొత్త ఆలోచనలకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు రూ.వేయి కోట్లతో 'ఫండ్ ఆఫ్ ఫండ్'ను అందుబాటులోకి తెస్తామన్నారు. కొత్త ఆలోచనలకు రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని యువ ఆవిష్కర్తలకు హామీ ఇచ్చారు.

# తొలివిడత పంచాయితీకి భారీ బందోబస్తు

(మొదటి పేజీ తరువాయి)

పకడ్బందీగా ఏర్పాట్లుచేసిందన్నారు. మొత్తం 3,800కు పైగా పంచాయతీల్లో ఎన్నికలు జరగనుండగా.. 3వేల పంచాయతీల్లో పోలింగ్‌ను నేరుగా వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షించనున్నట్టు చెప్పారు. బందోబస్తులో సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వు, ఇతర స్పెషల్ పోలీస్ సిబ్బంది కూడా పాల్గొంటారని తెలిపారు.సాధారణ పోలింగ్ కేంద్రాలతో పాటు సమస్యాత్మక కేంద్రాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశామని, కౌంటింగ్ పూర్తయ్యే వరకు సిబ్బంది పూర్తి స్థాయి విధుల్లో ఉంటారన్నారు. ఇప్పటి వరకు రూ. 8.20 కోట్ల విలువ చేసే మద్యం, డ్రగ్స్, ఇతర వస్తువుల స్వాధీనం చేసుకున్నట్టు డీజీపీ తెలిపారు. 54 అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నట్టు చెప్పారు. మహారాష్ట్ర, కర్ణాటక, ఏపీ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో ఉన్న చెక్‌పోస్టులు 24 గంటలూ పనిచేస్తున్నాయన్నారు. ప్రజలంతా తనిఖీలకు సహకరించి.. ప్రశాంతంగా ఓటింగ్‌లో పాల్గొనాలని డీజీపీ విజ్ఞప్తి చేశారు.

## త్వరలోనే పార్టీ పదవుల
# భర్తీని పూర్తి చేస్తాం..

(మొదటి పేజీ తరువాయి)

ఒప్పందాలు జరిగాయని వివరించారు. ముందు కొన్ని కార్యక్రమాలు ఫిక్స్ కావడంతో ఏఐసీసీ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే ,రాహుల్ గాంధీ తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు రాలేక పోయారని తెలిపారు. బుధవారం గాంధీభవన్‌లో మీడియాతో మహేశ్ కుమార్ గౌడ్ చిట్‌చాట్ చేశారు.తమ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై శ్వేతపత్రం విడుదల చేసే దమ్ము తమకు మాత్రమే ఉందని పేర్కొన్నారు. శ్వేతపత్రం అంటే బీఆర్ఎస్‌కు భయమని ఎద్దేవా చేశారు మహేశ్ కుమార్ గౌడ్. ఫ్యూచర్ సిటీ భవిష్యత్‌లో గొప్పగా ఉంటుందని తెలిపారు. త్వరలో వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్ట్‌లు భర్తీ చేస్తామని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. టీపీసీసీ నియామకం జరిగిన రోజే డీసీసీలతో మినహా అన్ని పోస్టులు రద్దు అవుతాయని తెలిపారు. ఈనెల చివరి నాటికి కార్పొరేషన్ ఛైర్మన్‌లు, డైరెక్టర్ పోస్టులు భర్తీ చేస్తామని చెప్పుకొచ్చారు. లంబాడాలకు నాలుగు జిల్లాలకు అధ్యక్షులను నియమించామని తెలిపారు. ఎస్టీలకు కాంగ్రెస్ పార్టీలో తగిన ప్రాధాన్యం ఉంటుందని వివరించారు. గ్లోబల్ సమ్మిట్ సక్సెస్ చూడలేక మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. లావాదేవీలలో భాగంగానే కవిత - బీఆర్ఎస్ నేతల మధ్య విమర్శలు చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కవిత కారణంగా బీఆర్ఎస్ కబ్జాలు అన్ని బయటకు వస్తున్నాయని విమర్శించారు. కవిత ఆరోపణలపై విచారణ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. తాను టీపీసీసీగా చాలా సంతృప్తిగా ఉన్నానని స్పష్టం చేశారు. ఆర్గనైజేషన్ అంటే తనకు ఇష్టమని చెప్పుకొచ్చారు. మీడియాలోనే తనకు డిప్యూటీ సీఎం పదవి ఇస్తున్నారని చెబుతున్నారని.. అప్పుడే మంత్రి పదవి ఇస్తున్నారంటూ కూడా ఊహాగానాలు వస్తున్నాయని తెలిపారు. లోక్‌సభలో ప్రియాంక గాంధీ చాలా బాగా మాట్లాడారని ప్రశంసించారు మహేశ్ కుమార్ గౌడ్. పశ్చిమ బెంగాల్ ఎలక్షన్ కోసం వందేమాతరాన్ని బీజేపీ తెరపైకి తెచ్చిందని విమర్శించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జవాహర్ లాల్ నెహ్రూను విమర్శిస్తూ జీవితంలో అతిపెద్ద పొరపాటు చేశారని మండిపడ్డారు. నెహ్రూ వల్లే దేశం వెనకబడిందని బీజేపీ నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు.

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఉస్మానియా విశ్వవిద్యాలయానికి వెళ్లాలంటే బయపడ్డారని ఎద్దేవా చేశారు. 1965లో ఇందిరా గాంధీ ఆర్ట్స్ కాలేజీకి వచ్చారని... 60 సంవత్సరాల తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి ఆర్ట్స్ కాలేజీకి వెళ్లడం చరిత్రగా నిలిచిందని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# అగ్రస్థాయి స్టార్టప్స్‌లో గూగుల్ ఒకటి

(మొదటి పేజీ తరువాయి)

గుర్తుచేశారు. తెలంగాణ భవిష్యత్ అభివృద్ధిని ఆకాంక్షించి ప్రపంచానికి తెలంగాణ బ్రాండ్‌ను పరిచయం చేయాలని గత రెండు రోజులు, మనం తెలంగాణ రైజింగ్ 2047 గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహించామని వివరించారు. జాతీయ అంతర్జాతీయ కార్పొరేట్ల సమక్షంలో తెలంగాణ భవిష్యత్ కోసం మన విజన్‌ను ఆవిష్కరించామని పేర్కొన్నారు. 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్లు ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దాలనే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. గత 20 ఏళ్ల క్రితం ప్రారంభించిన అనేక స్టార్టప్స్ నేడు బిలియన్ల డాలర్ల కంపెనీలుగా ఎదిగాయని చెప్పుకొచ్చారు సీఎం రేవంత్‌రెడ్డి.'గూగుల్, ఆపిల్, అమెజాన్, టెస్లా, ఫేస్‌బుక్ ఇలాంటి గొప్ప ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి. గత 25 సంవత్సరాల్లో సాఫ్ట్‌వేర్ సర్వీసెస్, ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాల్లో హైదరాబాద్‌లో చాలా స్టార్టప్స్ పెద్ద కంపెనీలుగా ఎదిగాయి. తెలంగాణ రైజింగ్ విజన్ స్టార్టప్స్ కోసం మీ ప్రణాళికలు ఏంటని అడిగితే... స్టార్టప్స్‌ని ఫుట్‌బాల్ ఆటతో పోలుస్తాం. నేను ఆ ఆట ఆడతాను. ఫుట్‌బాల్‌లో సమష్టి కృషి అవసరం. పట్టుదలతో సాధన చేయాలి. ఇది టీమ్ వర్క్. కానీ చివరకు గెలుపు చాలా ముఖ్యం. స్టార్టప్స్ కూడా అదే విధంగా ఉండాలి. ఈ రోజు నుంచి హైదరాబాద్ ప్రోడక్ట్ బేస్డ్ స్టార్టప్స్, ఇన్నోవేటీవ్ స్టార్టప్స్, ఐపీ ఇంటెన్సీవ్ స్టార్టప్స్ వీటి పైనే దృష్టి పెట్టాలి' అని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశర చేశారు.'హైదరాబాద్ కేవలం స్టార్టప్స్ హబ్‌గా ఎదగడమే కాదు. ఆ కంపెనీలు యూనికార్న్ కంపెనీలుగా ఎదగాలని కోరుకుంటున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్ నుంచి కనీసం 100 స్టార్టప్‌లు యూనికార్న్ కంపెనీలుగా ఎదగాలని ఆశిస్తున్నాం. కనీసం 1 బిలియన్ డాలర్ల విలువ కలిగిన కంపెనీలుగా ఎదగాలి. 2034 నాటికి వాటిల్లో కనీసం 10 సూపర్ యూనికార్న్ కంపెనీలుగా ఎదగాలి. అందుకోసం రాష్ట్రంలో ఒక మంచి ఎకోసిస్టమ్‌ను సృష్టించాలనుకుంటున్నాం. తెలంగాణ ప్రభుత్వం, గూగుల్ మీకు అవసరమైన సహకారం అందించడానికి సిద్ధంగా ఉన్నాయి. స్టార్టప్‌ల కోసం మా ప్రభుత్వం రూ. 1000 కోట్లతో స్టార్టప్స్ ఫండ్ ఏర్పాటు చేస్తుంది. ఆ ఫండ్స్‌ను వినియోగించుకోండి. తద్వారా స్టార్టప్‌లు గూగుల్ స్థాయిలో లేదా 1 బిలియన్ డాలర్ల కంపెనీగా ఎదగాలని కోరుకుంటున్నాం' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. దేశంలో తొలిసారిగా హైదరాబాద్‌లో గూగుల్ ఫర్ స్టార్టప్ కేంద్రాన్ని ఏర్పాటుచేయడం సంతోషంగా ఉందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. ఇప్పటికే ఎన్నో జీసీసీలు నగరంలో పెట్టుబడులు పెడుతున్నాయని.. స్టార్టప్‌లు సైతం ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశిరచుకుని ముందుకువెళ్లాలని సూచించారు.

# నేడే తొలి విడత పంచాయితీ పోరు

(మొదటి పేజీ తరువాయి)

వినియోగించుకోనున్నారు. వీరిలో 27,41,070 మంది పురుషులు, 28,78,159 మంది మహిళలు, 201 మంది ఇతరులు ఉన్నారు. తొలి విడతలో 395, రెండో విడతలో 495 గ్రామాల్లో ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయని చెప్పారు. ఇప్పటి వరకు తనిఖీల్లో రూ. 8.2 కోట్లు సీజ్ చేశామని వివరించారు. 50వేల మంది సివిల్ పోలీసులు విధుల్లో ఉంటారని, 60 ప్లటూన్స్ బృందాలు బయటి నుంచి వచ్చాయని ఎస్ఈసీ తెలిపారు.ఎన్నికల నిర్వహణ కోసం సుమారు లక్ష మంది ఎన్నికల సిబ్బందిని నియమించామని కమిషనర్ తెలిపారు. ఇందులో 3,591 మంది రిట ర్నింగ్ అధికారులు, 93,905 మంది పోలింగ్ సిబ్బంది ఉన్నారు. అలాగే ఎన్నికల పక్రియను పర్యవేక్షించేందుకు 2,489 మైక్రోఆబ్జర్వర్లను నియమించారు. పారదర్శకత కోసం 3,461 పోలింగ్ స్టేషన్లలో వెబ్‌కాస్టింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. మొత్తం 45,086 బ్యాలెట్ బాక్సులు వినియోగించనున్నారు. ఓటర్ సౌలభ్యం దృష్ట్యా 99 శాతం ఓటర్ స్లిప్పుల పంపిణీ పూర్తయ్యిందని కమిషనర్ వెల్లడించారు. మిగతా ఓటర్లు 'టీఎస్ ఈ-పోల్ మొబైల్ యాప్' ద్వారా కూడా తమ ఓటర్ స్లిప్‌ను డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం ఉందన్నారు. అలాగే ఓటింగ్ కేంద్రం తెలుసుకునే ఒదుకు అదే యాప్ ఉపయోగపడుతుందని తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో భాగంగా ఇప్పటివరకు 3,214 ఎఫ్ఐఆర్లు నమోదు చేసినట్లు తెలిపారు.

అంతేకాకుండా 31,428 మందిని బైండోవర్ చేసినట్లు, 902 లైసెన్స్‌డ్ ఆయుధాల డిపాజిట్, రూ. 7.54 కోట్ల విలువైన నగదు, మద్యం, డ్రగ్స్, విలువైన లోహాల స్వాధీనం చేసినట్లు రాణి కుముదిని వెల్లడించారు. నిన్న సాయంత్రం నుంచే మద్యం దుకాణాలు మూసివేశామని ఆమె తెలిపారు. భద్రతా చర్యలలో భాగంగా 31 జిల్లాల అధికారులకు మేజిస్ట్రేట్ పవర్స్ ఇచ్చామని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్, రెవెన్యూ యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తోందన్నారు. ఎన్నికల ప్రచారం కూడా మంగళవారం సాయంత్రం 5 గంటలతో ముగిసింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఓటర్లకు విజ్ఞప్తి చేస్తూ, భయభ్రాంతులు లేకుండా ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య బలోపేతంలో ఓటు కీలకమని పేర్కొంటూ, గ్రామాల భవిష్యత్తు నిర్ణయంలో ఓటు శక్తిని గుర్తించాలని ఆమె అన్నారు. అబ్జర్వర్లు, మైక్రో అబ్జర్వర్లతో ఈ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద సీసీ కెమెరా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ ఎన్నికల విధుల్లో లక్ష మందికి పైగా సిబ్బంది పాల్గొనున్నారని వివరించారు. ఈ ఎన్నికల్లో ఓటర్లు 18 రకాల ఐడి కార్డులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఏ రకమైన ఐడి కార్డును పోలింగ్ బూత్ అధికారులకు చూపించిన ఓటు వేయవచ్చునన్నారు. ఇక మంగవారం నుంచి ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో వైన్ షాపులన్నీ మూసి వేసినట్లు చెప్పారు. అన్ని జిల్లాల కలెక్టర్లకు మేజిస్ట్రియల్ పవర్స్ ఇస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు ఎస్ఈసీ వివరించారు. బందోబస్తు, శాంతిభద్రతల అంశాన్ని పోలీసులు పరిశీలిస్తున్నారని చెప్పారు. పోలింగ్ పూర్తికాగానే కౌంటింగ్ జరుగుతుందన్నారు.



## తెలంగాణ ఉద్యమంలో
# ఉస్మానియాదే కీలకం


(మొదటి పేజీ తరువాయి)

నిలిచిందన్నారు. ఆధిపత్యానికి వ్యతిరేకంగా తెలంగాణలో అనేక పోరాటాలు వచ్చాయి. నిజాం, రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా సాయుధ పోరాటం జరిగింది. సామాన్యులైన చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య.. దొరలపై పోరాడారు. ఉమ్మడి రాష్ట్రంలో న్యాయం జరగలేదని తెలంగాణ ఉద్యమం వచ్చింది. ఉద్యమాన్ని ఉస్మానియా నుంచే విద్యార్థులు ప్రారంభించారు. గతంలో ఈ వేదిక నుంచే స్వరాష్ట్ర ఆకాంక్షను విద్యార్థులు బలంగా వినిపించారు. పోరాడి సాధించిన రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలు నెరవేరాయా.. లేదా.. అని ఇక్కడే తెలుసుకోవాలని అనుకున్నానని అన్నారు. బుధవారం ఉస్మానియా వర్సిటీని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఓయూకు రూ. 1000 కోట్ల నిధులను సీఎం విడుదల చేశారు. ఈ నిధులను విద్యార్థులకు అంకితం చేశారు. అలాగే, ఓయూ అభివృద్ధికి రూ. 45 లక్షల చెక్కు పూర్వ విద్యార్థులు అందజేశారు. అనంతరం ఆర్ట్స్ కాలేజీ భవనం దగ్గర 'సర్వం సిద్ధం' పేరుతో నిర్వహించిన సభలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. స్వరాష్ట్ర ఆకాంక్షను బలంగా ఉస్మానియా యూనివర్సిటీ వినిపించిందని తెలిపారు. భవిష్యత్తు ప్రణాళికలపై చర్చించడానికి ఓయూకు వచ్చానని వివరించారు. గతంలో ముఖ్యమంత్రులను అడ్డుకున్న చరిత్ర ఉందని ప్రస్తావించారు. మీరు ఎందుకు ఓయూకు వెళ్లే ధైర్యం చేస్తున్నారని కొంతమంది తనతో అన్నారని గుర్తుచేశారు. మీరిచ్చే సూచనలు, మేధావులు ఇచ్చే సలహాలతో ఓయూను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దుతానని స్పష్టం చేశారు. విద్యార్థులకు తమ ప్రభుత్వం అండగా ఉండాలనే ఓ ఆలోచనతో ఇక్కడకు వచ్చానని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ధైర్యంతో కాదని.. విద్యార్థుల గుండెల నిండా ఉన్న అభిమానంతో ఆర్ట్స్ కాలేజీ వద్దకు వచ్చానని వ్యాఖ్యానించారు. తమ ప్రసంగాలు చదువుకొని కాదని.. తన మనసులో ఉన్నది చెప్పాలని ఇక్కడకు వచ్చానని చెప్పుకొచ్చారు. పురాతన యూనివర్సిటీలో ఉస్మానియా ఒకటని వివరించారు. ఉస్మానియా యూనివర్సిటీకి గొప్ప చరిత్ర ఉందని అభివర్ణించారు. ఇక్కడకు రావాలంటే ధైర్యం కాదని.. అభిమానం కావాలని చెప్పుకొచ్చారు. తెలంగాణలో చదువు లేకున్నా ఆధిపత్యాన్ని సహించరని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ప్రాంతానికి ఒక చైతన్యం, పౌరుషం ఉంది. ఎందరో ఓయూ విద్యార్థులు రాష్ట్రం కోసం ఆయుధాలతో అడవిబాట పట్టారు. గద్దర్, జార్జిరెడ్డి, పీవీ నరసింహారావు వంటి ఎంతోమంది ప్రముఖులను ఈ యూనివర్సిటీ ఇచ్చింది. బడికి వెళ్లని ఓ పేదింటి బిడ్డ అందెశ్రీ.. జయజయహే తెలంగాణ నినాదాన్ని అందించారు. సమాజానికి ఏ సమస్య వచ్చినా ఈ యూనివర్సిటీ విద్యార్థులు కదం తొక్కారు. రాష్ట్రం ఏర్పడ్డాక ఎవరి ఆస్తిలో వాటా అడగలేదు.. కేవలం స్వేచ్ఛ, సమాన అవకాశాలు మాత్రమే అడిగారు. మీరు ఎదిగేందుకు ఈ ప్రభుత్వం స్వేచ్ఛను ఇస్తుంది. ప్రపంచానికే మీరు దిక్సూచిగా మారాలి. ఎవరి గురించీ రాజకీయ వ్యాఖ్యలు చేయాలనుకోవడం లేదు. కొందరు రెండేళ్లుగా మాట్లాడుతున్నారు. నేను గుంటూరులో చదువుకోలేదు.. గూడుపుఠాణీలు చేయలేను. గుంటూరులో చదువుకున్న వాళ్లు బెంజ్ కారులో వెళ్లి పేదరికం గురించి తెలుసుకుంటారు. గుంటూరు, పుణె, అమెరికాలో చదువుకున్నాం అని ఉపన్యాసాలు ఇవ్వడం ద్వారా ఏం చెప్పాలని అనుకుంటున్నారు? నాకు భాష సరిగా రాకపోవచ్చు.. కానీ పేదవాడిని అర్థం చేసుకునే భాష వచ్చు. పేదవాడి బిడ్డ చదువుకుంటే ఎలాంటి ప్రయోజనం ఉంటుందో నాకు తెలుసు. పేదలు, నిస్సహాయులకు అండగా ఉండేలా చర్యలు చేపడుతున్నాం. నేను ఫాంహౌస్‌లు కట్టించుకోలేదు.. సాధారణంగానే ఉన్నా. రాష్ట్ర ముఖ్యమంత్రిగా, మీ సోదరుడిగా ఈ ఆర్ట్స్ కాలేజీ ముందు నిలుచున్నా. చరిత్రలో సజీవంగా నిలబడే కార్యక్రమాలు చేయాలని అనుకుంటున్నా. జయజయహే తెలంగాణ గీతం, తెలంగాణ తల్లిని ఆవిష్కరించుకున్నాం. వర్గీకరణ ద్వారా దళితుల సమస్యను శాశ్వతంగా పరిష్కరించాం. జనగణనలో కులగణన చేపట్టి వందేళ్ల సమస్యను పరిష్కరించాం. ప్రభుత్వం దగ్గర పంచేందుకు డబ్బు లేదు. దళితులకు మూడెకరాల భూమి ఇస్తామన్నారు.. గత పదేళ్లలో ఎవరికైనా ఇచ్చారా? భూములు ఉన్న ఆసాములు కూడా వెనుకబాటుతనంతో బాధపడు తున్నారు. దాన్ని నిర్మూలించాలంటే ప్రతి గ్రామంలో విద్యావకాశాలు పెంచాలి. నాణ్యమైన విద్య, స్కిల్స్‌ను అందించేందుకు కృషి చేస్తున్నాం. విద్య ఒక్కటే మన ఆత్మగౌరవాన్ని పెంచుతుందన్నారు. విద్యాలయాల్లో కుల వివక్ష ఉండకూడదనే యంగ్ ఇండియా స్కూల్స్‌లో అందరూ కలిసి చదువుకునేలా చర్యలు చేపట్టాం. డబ్బు ఉన్నవాళ్లు ఎక్కడికి వెళ్లి అయినా చదువుకోగలరు. పేదింటి విద్యార్థులకు ఉస్మానియా యూనివర్సిటీ నాణ్యమైన విద్యను అందించాలి.




మంజూరు చేసిన రూ. 1000 కోట్లు డబ్బుగా కాదు.. భవిష్యత్తు తరాలకు పెట్టుబడిగా చూస్తున్నాం. ఉత్తుత్తి మాటలు చెప్పను.. మన చేనుకి చీడ పడితే ఏ మందు కొట్టాలో నాకు తెలుసు. నాకు ఇంగ్లీష్ రాదని వాళ్లు అనుకుంటున్నారు. చైనాకు కూడా ఆ భాష రాదు.. కానీ ఆ దేశం ప్రొడక్షన్ నిలిపివేస్తే అమెరికా కూడా విలవిలలాడుతుంది. భాష కేవలం కమ్యూనికేషన్ కోసం మాత్రమే.. అది నాలెడ్జ్ కాదు. రాష్ట్రానికి ఓయూ గుండెకాయ లాంటిది. సమస్యల మీద కొట్లాడతానంటే నేను వద్దు అనను. రాజకీయ పార్టీల మోచేతినీళ్లు తాగాలని.. వాళ్ల జెండాలు మోయాలని అనుకోవద్దు. మీ స్వతంత్రతను నిలబెట్టుకోండని రేవంత్ అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీకి ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించింది. రూ.వెయ్యి కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రూ.వెయ్యికోట్ల నిధుల విడుదల జీవోను విద్యార్థులకు అంకితం చేస్తున్నట్లు సీఎం పేర్కొన్నారు.



## జాగృతి వారపత్రిక ద్వారా పోస్టల్ సిబ్బందికి సన్మానం

**కోరుట్ల, డిసెంబర్ 10 (వార్త వేదిక సూర్య):**
గత 78 ఏళ్లుగా జాగృతి వార పత్రిక తెలుగు పాఠకకులక్కు నాన్ని, వినోదాన్ని పంచుతూ, సమాజాన్ని జాగృతం చేస్తూ పాఠకులలో జాతీయ భావాలను పెంపొందించడమే కాకుండా మన సంస్కృతి, సాంప్రదాయాలను, పండగలను గురించి ప్రత్యేక వ్యాసాలతో, కథనాలతో వాస్తవవిషయాలను మనకు తెలియని ఎన్నో కొత్త విషయాలను మన ముందు ఉంచుతుంది. ఈ పోస్టల్ సిబ్బంది యొక్క సేవలను గుర్తించి జాగృతి వార పత్రిక, కోరుట్ల ఆధ్వర్యంలో కోరుట్ల పోస్టల్ కార్యాలయ సిబ్బంది అందరికీ మర్యాద పూర్వకంగా సన్మానం చేయడం జరిగింది. సన్మాన గ్రహీతలో పోస్ట్ మాస్టర్ లోకిని గంగాధర్, క్లర్కులు పి. సంతోష్, యు.ఉపేంద్ర, పోస్ట్ మ్యాన్‌లు నారాయణ, చైతన్య, ఉస్మాన్, రాజేంద్ర ప్రసాద్,ప్యాకర్ ఎం.ఎ. రహమాన్, పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జాగృతి పత్రిక చందాదారులు గుండు సాయి మధుకర్, వడ్లకొండ రాజగంగాధర్,గట్ల శివకుమార్, గంగుల రాజ్ కుమార్, రొండి రవికుమార్, కొమ్మనపెల్లి గంగాధర్, రొండి ధార్విక్ ఆర్యమన్ లు పాల్గొనడం జరిగింది.

## జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

**కోరుట్ల, డిసెంబర్ 10 (వార్త వేదిక సూర్య):**
స్థానిక గౌతమ్ హై స్కూల్ విద్యార్థులు పంజాబ్ యునివర్సిటీ చండిగర్లో నిర్వహిస్తున్న 36వ జాతీయస్థాయి బాలబాలికల ఆట్యా పాత్యా ఆటల పోటీలకు ఎంపికైన విద్యార్థులు టి. భరత్ చంద్ర, హేమ యజ్ఞ ప్రణయ లను పాఠశాల కరస్పాండెంట్ శ్రీ. యం.ఎ.గఫార్ ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా




మాట్లా డుతూ విద్యార్థులు చదువులోనే కాక ఆటల పోటీల్లో కుడా ముందుండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రెసిడెంట్ యం.ఎ కిజర్, జాయింట్ సెక్రటరి యం.ఎ అఫ్రోజ్, ఆట్యా పాత్యా ప్రెసిడెంట్ వాసం నవీన్ కుమార్, సెక్రటరీ కొక్కుల రాజేష్ ప్రిన్సిపాల్స్ గోపి మారాసి, క్రిస్టినా, వ్యాయమ ఉపాధ్యాయులు బి. వేణు గోపాల్(పి.డి), విజయ్ నాయక్ ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## అవకాశం కల్పించండి.. అభివృద్ధి చేస్తా..

**ధోతి గూడెం గ్రామం ఇండిపెండెంట్ సర్పంచ్ అభ్యర్థి యాట జంగయ్య ముదిరాజ్**

**భూదాన్ పోచంపల్లి, డిసెంబర్ 10 (వార్త వేదిక సూర్య):** గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని దోతిగూడెం గ్రామం ఇండిపెండెంట్ సర్పంచి అభ్యర్థి యాట జంగయ్య




ముదిరాజ్ అన్నారు. బుధవారం భూదాన్ పోచంపల్లి మండలం దోతి గూడెం గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను గెలిపిస్తే గ్రామంలో అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని అన్నారు. తనను ఆశీర్వదించి ఒక్కసారి అవకాశం కల్పిస్తే జిల్లాలోనే గ్రామాన్ని ఆదర్శంగా తీర్చి దిద్దుతాన ని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకట్ రెడ్డి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఆశీర్వదించి ఓటెయ్యండి...

**అంతమ్మ గూడెం గ్రామ సర్పంచ్ కాంగ్రెస్ అభ్యర్థి గుమ్మి జంగారెడ్డి**

**భూదాన్ పోచంపల్లి, డిసెంబర్ 10 (వార్త వేదిక సూర్య):** గ్రామ ప్రజలందరూ తనను ఆశీర్వదించి ఓటు వేసి గెలిపించాలని అంతమ్మ గూడెం కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి గుమ్మి జంగారెడ్డి కోరారు. బుధవారం భూదాన్ పోచంపల్లి మండలం అంతమ్మ గూడెం గ్రామంలో ముమ్మ రంగ ప్రచార నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తానని తనకు అవకాశం కల్పించాలని ఓటర్లను కోరారు .






### అధికారులు-ప్రజా ప్రతినిధుల పట్టింపు లేకపోవడంతో

# నిలిచిపోయిన కల్వర్ట్ పనులు

**'ఇప్పటికైనా మేల్కోనాలి!' - కల్వర్ట్ నిర్మాణాన్ని వేగవంతం చేయాలని విద్యార్థుల డిమాండ్..**



**మైలర్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 10 (వార్త వేదిక సూర్య):**
ఉడంగడ్డ పల్లెచెరువు నుంచి మహావీర్ కాలేజీ వైపు వెళ్లే ప్రధాన మార్గంలో చేపట్టిన చెరువు కల్వర్ట్ నిర్మాణ పనులు దాదాపు నెలరోజులుగా నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థుల రాకపోకలకు కీలకమైన ఈ రహదారి మూసివేత తరహా పరిస్థితులు ఏర్పడటంతో ప్రతిరోజూ ప్రమాద భయం పొంచి ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహావీర్ కాలేజీ, ఆరోరా, మరో రెండు ఇంజనీరింగ్ కళాశాలలతో ఈ ప్రాంతం విద్యా కేంద్రంగా వెలుగొందుతోంది. వేలాదిమంది విద్యార్థులు ప్రతిరోజూ ఈ రహదారిపై ప్రయాణిస్తుండటంతో కల్వర్ట్ పనులు నిలిచిపోయిన ప్రభావం మరింతగా కనిపిస్తోంది. రాత్రి, పగలు అనే తేడా లేకుండా కాలనీల నుంచి ప్రయాణించే ప్రజలు కూడా ఈ అవ్యవస్థకు గురై భారీ ప్రమాదాల అంచున నడవాల్సి వస్తోంది. "పనులు ఎప్పుడెప్పుడు పూర్తవుతాయి? ఎవరైనా పట్టించుకుంటారా?" అనే ప్రశ్నలు విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానికుల నోళ్లలో వినిపిస్తున్నాయి. అత్యవసరంగా పూర్తి చేయాల్సిన కల్వర్ట్ పనులు నత్తనడకన కొనసాగుతుండడం పై నివాసితులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారుల నిర్లక్ష్యం, ప్రజా ప్రతినిధుల ఆదరణ లేకపోవడం వల్లే పరిస్థితి ఈ దశకు చేరిందని ప్రజలు ఆరోపిస్తున్నారు.

**ఒకవైపు ప్రమాదకర రహదారి,**
**మరోవైపు నిలిచిపోయిన నిర్మాణ పనులు..**

ఈ రెండు సమస్యలతో విద్యార్థులు, ప్రజలు నడకలోనే కాకుండా మనసులోనూ భయంలోనూ ప్రయాణిస్తున్నారు. వర్షాలు కురిస్తే ఈ మార్గంలో ప్రయాణించడం మరింత ప్రమాదకరమని వారు హెచ్చరిస్తున్నారు. "ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్వర్ట్ నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి." పనులు మళ్లీ వేగవంతం చేసి, రహదారిని సురక్షితంగా మార్చే వరకు సమస్యను సీరియస్‌గా తీసుకోవాలని విద్యార్థులు, ప్రజలు గళం వినిపిస్తున్నారు.

## క్రిస్మస్ వేడుకలకు అధిక నిధులు మంజూరు చేసిన సీఎంకు ధన్యవాదములు



**యాదాద్రి భువనగిరి,డిసెంబర్ 10 (వార్త వేదిక సూర్య):**
తెలంగాణ రాష్ట్రంలోని క్రైస్తవులు అత్యంత వైభవంగా జరుపుకునే "క్రిస్మస్ పండుగకు" అధిక నిధులు మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలుపుతున్నామని జిల్లా అధ్యక్షులు పాస్టర్ జాన్ జహంగీర్ అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలోని 7 వేల చర్చిలకు, 21 కోట్ల రూపాయల నిధులు కేటాయించి, క్రిస్మస్ పండుగను ఘనంగా జరుపుకొనే విధంగా ఆదేశాలు జారీ చేయడం హర్షణీయమని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, మరియు తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ దీపక్ జాన్ లకు యాదాద్రి భువనగిరి జిల్లా క్రిస్టియన్ మైనారిటీ సౌదర, సోదరీమణులు పక్షాన కృతజ్ఞతలు తెలుపుతున్నామని జహంగీర్ తెలిపారు. తెలంగాణ లోని ఒక్కోక్క చర్చికి రంగులు వేయుటకు మరియు విద్యుత్ దీపాలంకరణకు 30వేల రూపాయల చొప్పున కేటాయించి, క్రిస్మస్ విందుకు రాష్ట్ర వ్యాప్తంగా 4 కోట్ల రూపాయల కోట్ల నిధులు మంజూరు చేసి, క్రిస్మస్ 2025 వేడుకలను రాష్ట్రమంతటా ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా ఆదేశించారని ఆయన అన్నారు . ఈ అవకాశాన్ని యాదాద్రి భువనగిరి జిల్లాలోని చర్చి లో బాధ్యులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. చర్చి కమిటీ లెటర్ ప్యాడ్ మీద, బ్యాంకు అకౌంట్‌ను జతపరచి ఈనెల 12 లోగా జిల్లా కలెక్టర్ కు లేదా జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కి దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాలకు (1) 040- 29801130, (2) 040- 23391067 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

# సమస్యలు తీర్చే వారే సర్పంచ్ కావాలి

**కాంగ్రెస్‌తోనే గ్రామ అభివృద్ధి సాధ్యం:**
**బర్రె జహంగీర్ మాజీ మున్సిపల్ చైర్మన్**

**యాదాద్రి భువనగిరి, డిసెంబర్ 10 (వార్త వేదిక సూర్య):**
కాంగ్రెస్‌తోనే గ్రామంలో అభివృద్ధి సాధ్యమవుతోందని కాంగ్రెస్ పార్టీ నాయకులు, బర్రె జహంగీర్ భువనగిరి మాజీ మున్సిపల్ చైర్మన్ సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. కాంగ్రెస్ బలపరిచిన తుక్కపురం గ్రామ పంచాయతీ సర్పంచి అభ్యర్థి జనగాం మల్లేష్ కీ మద్దతుగా కత్తెర గుర్తుకే ఓటు వేసి గెలిపించాలని ఎన్నికల ప్రచారం చేశారు. కాంగ్రెస్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కత్తెర గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థిలను గెలిపించాలని కోరారు ఆపదలో అయ్యా అని పిలిస్తే వచ్చి సమస్యలు పరిష్కారం చేసే సర్పంచ్ వార్డు సభ్యులను స్థానిక సమస్యలను గుర్తించి గ్రామంలోని రోడ్ల వెంట వీధుల్లో వర్షం మురుగునీళ్లు వెళ్లేలా డ్రైనేజ్ వ్యవస్థ నిర్మించే సీసీ రోడ్లను ఏర్పాటు చేసే గ్రామాలలో కోతుల బెడదను నివారించే వారిని ఎన్నుకోవాలని అధికార పార్టీ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి గారి



మద్దతు ఉన్న వారికి గ్రామ మద్దతు ఇచ్చి అభివృద్ధికి సహకరించుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో తుక్కాపురం గ్రామ సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి జనగాం మల్లేష్, వార్డు సభ్యులు,జనగాం సత్తయ్య,కళ్లెం పద్మ, గ్రామ నాయకులు పొట్ట ముత్యాలు, నల్లమాస్ చంద్రయ్య, జనగాం అశోక్,జనగాం




మీనాక్షి,నరేష్, గ్రామ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల పరిశీలకులు పిట్టల బాలరాజ్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి, మాజీ కౌన్సిలర్ సీనియర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు వడిచెర్ల కృష్ణ యాదవ్, గ్యాస్ చిన్న (పి. సురేందర్) తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన మౌలిక వసతులను అందించడమే ప్రధాన ధ్యేయం

**రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్, డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి**

**మైలర్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 10 (వార్త వేదిక సూర్య):**
రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని మైలార్ దేవ్‌పల్లి డివిజన్ పరిధిలో హౌసింగ్ బోర్డు కాలనీ- పద్మశాలిపురం కనెక్టింగ్ రోడ్డుకు ఎదురుగా ఉన్న గ్రేవ్‌యార్డ్ ప్రాంతంలో అభివృద్ధి కార్యక్రమాల భాగంగా రూ.50 లక్షల వ్యయంతో నూతన సీవరేజ్ డ్రెయినేజ్ పైప్‌లైన్ వ్యవస్థను నిర్మించారు. ఈ పనుల శిలాఫలక ప్రారంభోత్సవాన్ని





రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్, డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులను అందించడమే ప్రధాన ధ్యేయమని, అందుకోసం అహర్నిశలు కృషి చేస్తున్నామని తెలిపారు. కాలనీ వాసులు ఎంతోకాలంగా ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యకు శాశ్వత పరిష్కారం అందించగలిగినందుకు సంతోషం వ్యక్తం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించడం కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. కొత్త పైప్‌లైన్ ఏర్పాటుతో దీర్ఘకాలిక సమస్య పరిష్కారం కావడంతో బస్తీ మహిళలు ఆనందం వ్యక్తం చేస్తూ కార్పొరేటర్



శ్రీనివాస్ రెడ్డిని ఘనంగా శాలువా, పూలమాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బుచ్చి రెడ్డి, డివిజన్ మాజీ అధ్యక్షుడు అడికే జనార్ధన్, అడికే మహేందర్, బబ్లూ, శ్రీకాంత్ రెడ్డి, ఎల్.వి. రెడ్డి, ఎన్ను శంకర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, కృష్ణ రెడ్డి, రాజ్‌కుమార్, రాజవర్ధన్ రెడ్డి, అడికే శివ, రామరావు, సచిన్ షిండే, రాజేష్, హెచ్ఎండబ్ల్యూఎస్ & ఎస్ బి జీఎం సాయి లక్ష్మి, డీజీఎం రేణుక, ప్రసాద్ సహా పలువురు బస్తీవాసులు పాల్గొన్నారు.






# ఎన్నికల ప్రవర్తన నియమాలలిని పాటించాలి

**- ఎన్నికల ఎగ్జిబిషన్ అబ్జర్వర్ వెంకట్ రెడ్డి**

**మోత్కూరు,డిసెంబర్ 10 (వార్త వేదిక సూర్య):** ఈ నెల 17న జరిగే మూడో విడత పంచాయతీ ఎన్నికలల్లో సంబంధించిన ఎన్నికల నియమాళిని మండలంలోని 10 గ్రామ పంచాయతీల సర్పంచ్,85 వార్డులలో పోటీ చేసే అభ్యర్థులు ఖర్చులు తదితర అంశాలను ఎన్నికల ఎగ్జిబిషన్ అబ్జర్వర్ వెంకట్ రెడ్డి వివరించారు. బుధవారం నాడు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో సంబంధిత అధికారులచే ముందస్తు అనుమతులు పొందిన తర్వాతనే వాహనాలు, మైక్ లను వినియోగించుకోవాలని, మద్యం, డబ్బు లాంటి ఓటర్లను ప్రలోబాలకు గురి చేయవద్దని ఎంపీడీవో బాలాజీ నాయక్ పేర్కొన్నారు. శాంతిభద్రతలకు విఘాతం జరగకుండా, స్నేహపూర్వకంగా వాతావరణంలో ఎన్నికలను జరుపుకోవాలని సిఐ వెంకటేశ్వర్లు తెలిపారు గ్రామాలలో ర్యాలీలు, సమావేశాలు, ప్రచారాలు నిర్వహించుకునే అభ్యర్థులు ముందు విధిగా తమ అనుమతులు పొందాలని తహశీల్దార్ పి.జ్యోతి అన్నారు. సర్పంచుల పోటీ చేసే అభ్యర్థులు వారు చేసే ఖర్చు కొత్తగా ఖాతా చేసిన బ్యాంక్ అకౌంట్ నుండి 1.50( ఒక లక్షా యాభై వేలు) వార్డు గా పోటీ చేసే అభ్యర్థులు 30000 (ముప్పై వేలు) మాత్రమే ఖర్చు చేయాలని మాస్టర్ ట్రైనర్ సుధాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం. పి. ఓ పైళ్ళ జనార్దన్ రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ వెంకటేశ్వర్ రెడ్డి, ఎక్స్ పెన్లి ఆఫీసర్ రాం నర్సయ్య, ఎం పి.ఎస్.ఓ. కృష్ణ, ఆర్. ఐ సుమన్, ఏఈఓ లు తుంగ గోపీనాథ్, అశోక్, సింహప్రసాద్ , పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే గాధరి కిషోర్ కుమార్ చేసిన

# వ్యాఖ్యలు వెంటనే ఉపసరించుకోవాలి

**కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గుర్రం లక్ష్మీ నర్శింహ్మా రెడ్డి**

**మోత్కూరు: డిసెంబర్ 10 (వార్తా వేదిక సూర్య):** తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి పై తుంగతుర్తి మాజీ శాసనసభ్యులు గాదరి కిషోర్ కుమార్ తన స్థాయిని మరిచి మతిస్థిమితం కోల్పోయి అడ్డగోలుగా మాట్లాడుతున్నారని ఆయన చేసిన వాఖ్యాలు వెంటనే ఉపసరించుకోవాలని. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గుర్రం లక్ష్మి నర్సింహ్మా రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం నాడు ఆయన మోత్కూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కిషోర్ మాట్లాడం చూస్తుంటే ఆయన ఇక బి.ఆర్.ఎస్ రాష్ట్రంలో అధికారం రాలేమని భయం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. విద్యార్థి నాయకుడిని అని చెప్పుకునే కిషోర్ గత 10 ఏళ్లలో ఏ రోజైనా నిరుద్యోగుల గురించి మాట్లాడినవా.. అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాదిలోపే సీఎం రేవంత్ రెడ్డి 60వేల ఉద్యోగాలను భర్తీ చేశారని గుర్తు చేశారు. ప్రతినిత్యం విద్యార్థులు, నిరుద్యోగ సమస్యలపై ముఖ్యమంత్రి ఆలోచింప చేస్తున్నారని అన్నారం పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించాలని ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను 20వేల కోట్లతో నిర్మిస్తుంటే కళ్ళుండి చూడలేని కబోదుల్లాగా



బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 10 ఏళ్లలో తుంగతుర్తి నియోజకవర్గంలో అన్ని రంగాలలో అనేక అక్రమాలు పాల్పడ్డారని... అందుకే 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఈ నియోజక వర్గ ప్రజలు కర్రుకాల్చి 50 వేల మెజార్టీతో చిత్తుగా ఓడగొట్టి కర్రు కాల్చి వాతలు పెట్టినా సిగ్గు లేకుండా మాట్లాడుతున్నారని అన్నారు. ఇంకోసారి ముఖ్యమంత్రిపై అవాకులు చవాకులు పేలితే సహించేది లేదని లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి హెచ్చరించారు.

ఈ సమావేశంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గుండగోని రామచంద్రు గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పన్నాల శ్రీనివాస్ రెడ్డి,, పోచం జగన్నాధం ,మాజీ కౌన్సిలర్ కళ్యాణ్ చక్రవర్తి,, జిల్లా యూత్ కాంగ్రెస్ మాజీ కార్యదర్శి మందుల సురేష్, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు ముద్దం జయశ్రీ,, అన్నెపు పద్మ, , పల్లపు సమ్మయ్య, ,పోలినేని స్వామి రాయుడు, సోషల్ మీడియా కన్వీనర్ పాలోజు శేఖరాచారి, అశోక్ రెడ్డి, దశరథ తదితరులు పాల్గొన్నారు.

# సోషల్ మీడియాలో జోరుగా సర్పంచ్ అభ్యర్థుల ప్రచారాలు..

**మోత్కూరు, డిసెంబర్ 10 (వార్తా వేదిక సూర్య):**

తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న సర్పంచ్ ఎన్నికల్లో గతానికి భిన్నంగా ఈసారి కొత్త ఒరవడి కని పోస్తోంది. గత సంప్రదాయ రాజకీయ పద్ధతులకు భిన్నంగా సర్పంచులుగా పోటీ చేసే అభ్య ర్థులు సోషల్ మీడియా వేదికలను విస్తృతంగా వినియోగిస్తున్నారు. కేవలం ప్రజాక్షేత్రంలో సభలు, సమావేశాలు నిర్వహించడమే కాకుండా అభ్యర్థులు తమ సందేశాలను, హామీలను నేరుగా ఓటర్లను చేరవేయడానికి ఫేస్ బుక్, వాట్సాప్, ఇన్ స్ట్రాగ్రామ్, యూట్యూబ్ వంటి మధ్యమాలను ఉపయోగిస్తున్నారు.

గత ఎన్నికల వరకు కేవలం ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ లతో పాటు ఇతర కొన్ని ఎన్నికలలో మాత్రమే కనిపించిన ఈ డిజిటల్ ప్రచార ఉధృతి ప్రస్తుతం గ్రామీణ స్థాయిలోఊపందుకోవడం స్థానిక రాజకీయాలలో పెను మార్పుకు సాంకేతికంగా భావించవచ్చు. ఈ సాంకేతిక పరిజ్ఞానం పట్ల గ్రామీణ ప్రజలలో పెరుగుతున్న అవగాహనకు ఈ పరిణామం అద్దం పడుతోంది. ఈ కొత్త ట్రెండ్‌లో భాగంగా సర్పంచులు, వార్డులకు పోటీచేసే అభ్యర్థులు తమ ప్రచారాలను మరింత ఆకర్షణీయంగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికల మాదిరిగానే ఆయా



పోటీచేసే అభ్యర్థులు తమ పేరు, గుర్తు తాను గెలిస్తే హామీలను వివరిస్తూ ప్రత్యేక పాటలను రికార్డులు చేయించి వాటిని సోషల్ మీడియాలో హెూరెత్తిస్తున్నారు.

ఈ పాటలు గ్రామీణ యువతకు ఆకర్షణీయంగా ఆకట్టుకుంటున్నాయి. యువ అభ్యర్థులు సాంప్రదాయ రాజకీయాలను పక్కన పెట్టే యువతను ఆకర్షించే వినూత్న ప్రచార పద్ధతులకు మొగ్గు చూపుతున్నారు. ఇది ఓటింగ్ సరళి, గెలుపోటములకు నిర్దేశించే అవకాశం ఉందని పలువురు రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. సోషల్ మీడియా ప్రచారం ఎంత ప్రభావవంతంగా ఉన్నప్పటికీ , దీని వెనక ముఖ్య సందేశం యువ ఓటర్లను ప్రసన్నం చేసుకోవడమే.....

రాష్ట్రంలో అన్ని గ్రామీణ ప్రాంతాలలో మొబైల్ వినియోగం పెరగడం ఇంటర్నెట్ మెరుగైన సదుపాయం మెరుగు పరచడంలో యువత సోషల్ మీడియాలో చురుకుగా పాల్గొంటున్నారు. ఈ మార్పు కేవలం ప్రచార పద్ధతులకే పరిమితం కాకుండా భవిష్యత్ లో యువత రాజకీయాలలో భాగస్వామి కావడానికి ఈ ప్రచార హెూరెత్తుతూ ఎంతో ఉపయోగపడుతుంది. సర్పంచ్ ఎన్నికల్లో సోషల్ మీడియా వినియోగం అనేది తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల చరిత్రలో ఒక నూతన అధ్యాయాన్ని లిఖిస్తోందని భావించవచ్చు.




# కేంద్ర ప్రభుత్వంచేస్తున్న ఓటు చోరీపై పట్టణ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

**మోత్కూరు: డిసెంబర్ 10 (వార్త వేదిక సూర్య):**

దేశంలో అన్ని రాష్ట్రాలలో ఓటు చోరీ చేస్తున్న కేంద్ర ప్రభుత్వం వైఖరిని నిరసిస్తూ లోక సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఇచ్చిన పిలుపుమేరకు బుధవారం నాడు మోత్కూరు పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద పట్టణ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ"ను నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గుండగోని రామచంద్రు గౌడ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు గుర్రం లక్ష్మీనర్సింహ్మారెడ్డి"లు మాట్లాడుతూ దేశంలో బీజేపీ పార్టీ అక్రమంగా ఓటు చోరీ చేసి ప్రజాస్వామ్య వ్యవస్థను కూని చేసి గద్దెనెక్కిందన్నారు.రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహారిస్తున్న బీజేపీ వైఖరిని ఎండగట్టేందుకు గడపగడపకు తెలియజేసేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు.. వివిధ వర్గాల ప్రజల నుంచి సేకరించిన ఈ సంతకాల సేకరణను పిసిసికి అందజేయనున్నట్లు రామచంద్రు గౌడ్, లక్ష్మీ నర్శింహ్మా రెడ్డిలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఐడీసీ మాజీ డైరెక్టర్ కంచర్ల యాదగిరి రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు అవిశెట్టి ఆవిలిమల్లు, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు పురుగుల నర్సింహ్మా, యూత్ కాంగ్రెస్ జిల్లా మాజీ కార్యదర్శి మందుల సురేష్, గ్రంథాలయం మాజీ చైర్మన్ కోమటి మత్స్య గిరి, ఉప దళలు పోలినేని స్వామి రాయుడు, బీసీ విద్యార్థి, యువజన యువజన సంఘం జాతీయ అధ్యక్షులు గడ్డం నర్శింహ్మా, సోషల్ మీడియా పట్టణ ,మండల కన్వీనర్లు పాలోజు శేఖరా చారి, బందెల రవి, స్థానిక నాయకులు బయ్యని రాజు, పల్లపు సమ్మయ్య, గోపాల్ దాస్ బిక్షం తదితరులు పాల్గొన్నారు.



# స్థానిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలి

**జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు అవిశెట్టి ఆవిలిమలు**

**మోత్కూరు: డిసెంబర్ 10 (వార్తా వేదిక సూర్య):** స్థానిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు అవిశెట్టి అవిలిమల్లు కోరారు. బుధవారం నాడు ఆయన మోత్కూరులో విలేకరులతో మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో పేద ప్రజలకు ఏలాంటి ప్రయోజనం కలగలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఏర్పడిన రెండేళ్ల లోపే పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, 200 యూనిట్ల లోపు ఉచిత కరెంట్, అర్హులైన పేదలందరికీ తెల్ల రేషన్ కార్డులు అందించడంతోపాటు ప్రతి లబ్ధిదారునికి 6కిలోల సన్న చొప్పున బియ్యం అందిస్తున్నామని అవిలిమల్లు తెలిపారు. పేద ప్రజల సంక్షేమం కోసం నిరంతర కృషి చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నే రానున్న స్థానిక ఎన్నికలలో అత్యధిక మెజార్టీ లతో గెలిపించాలని ప్రజలను కోరారు.




# ప్రజాపాలనకాదు.. రాక్షస పాలన

**- మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొణతం యాకుబ్ రెడ్డి**



**మోత్కూరు, డిసెంబర్10, (వార్త వేదిక సూర్య):** రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా తుంగతుర్తి నియోజక వర్గంలో ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో అరాచకమే ప్రభలిందని, శాంతి భద్రతలు కనుమరుగై హత్యా, రౌడీ, రాజకీయాలు రాజ్యమేలుతున్నాయని మోత్కూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొణతం యాకూబ్ రెడ్డి అన్నారు. బుధవారం నాడు ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంగళవారం నాడు నూతనకల్ మండలం లింగంపల్లి లో బిఆర్ఎస్. నాయకుడు ఉప్పల మల్లయ్య ఎదుగులను చూసి ఆయన హత్యను చేశారని....ఇది ఇందుకు నిదర్శనం కాదా అని ప్రశ్నించారు.. గత 10 సంవత్సరాల కాలంలో మాజీ ఎమ్మెల్యే కిషోర్ కుమార్ తుంగతుర్తి నియోజకవర్గం సస్యశ్యా మలంగా పచ్చని పొలాలతో పరస్పర సహకారంతో పార్టీలకతీతంగా ప్రజలందరూ కలిసే పని చేశారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ వచ్చిన రెండు సంవత్సరాలలో తుంగతుర్తి నియోజకవర్గం మరో రాయలసీమగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు. బి. ఆర్. ఎస్. పార్టీ కానీ, మాజీ ఎమ్మెల్యే ఏనాడు కూడా హత్యారాజకీయాలను ప్రోత్సహించలేదన్నారు. లింగంపల్లిలో జరిగిన ఘటన పై పోలీసులు పక్షపాత చూపకుండా నేరస్థులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

## మండల కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థులు జాబితా

**మోత్కూరు, డిసెంబర్ 10 (వార్తా వేదిక సూర్య):**

మండలంలోని 10 గ్రామపంచాయతీలకు కాంగ్రెస్ పార్టీ పక్షాన పోటీ చేస్తున్న అభ్యర్థుల జాబితా"ను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వంగాల సత్యనారాయణ బుధవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. పాలడుగు బిబియాస నర్సిరెడ్డి, దత్తప్పగూడెంబి గుండు యాదగిరి, అనాజీపురం బి బీసు వెంకటయ్య, పొడిచేడు బి జిట్టా సైదులు, దాచారం కర్నే జ్యోతి ,వీరేశం పాటిమట్ల బిబండ రమ, విజయ్ రెడ్డి సదర్శాపురంబిబి మునుకుంట్ల నీలకంఠం ముషిపట్ల.బిబి పైళ్ల నర్సిరెడ్డి, పనకబండ బిబినకిరేకంటి సైదమ్మబిరామనర్సయ్య, రాగిబావిబి గంటా పద్మబి వెంకట్ రెడ్డి లను ఖరారు చేసినట్లు. సత్యనారాయణ తెలిపారు.

## బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థుల గెలుపు

# దిశలో ముందంజ

**అధికార అవినీతి అంతం మొదటి అడుగు**

**గెలిపే లక్ష్యంగా పనిచేయండి**

**-బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కొప్పుల హరిదీప్ రెడ్డి**

**ఆత్మకూరు (ఎం),డిసెంబర్ 10 (వార్త వేదిక సూర్య):**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, కేహెచ్ఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ కొప్పుల హరిదీప్ రెడ్డి బీఆర్ఎస్ బలపర్చిన సర్పంచ్



అభ్యర్థులు గెలుపు దిశలో ముందంజలో ఉన్నారు అని అన్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని పార్టీ బలపరిచిన సర్పంచ్ ,వార్డు అభ్యర్థులు కార్యకర్తలతో ఏకమై వారిని ఓటర్ల తో విధివిధానాలను తెలుసుకుని మంచి చెడులు తెలుకుని అధికారం ముఖ్యం కాదు అభివృద్ధి ముఖ్యం అని, కేంద్రం, రాష్ట్ర నిధులు గ్రామంలో ఏ పార్టీ సర్పంచ్ ఉన్న ఏ అధికార నాయకులు మాయమాటలు చెప్పిన వచ్చే నిధులు వస్తేనుంటాయి.అందరూ ఓటర్లతో మనం చేసే అభివృద్ధి గురించి చెప్పి ,అధికార పార్టీ అవినీతి అంతం బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థుల గెలుపుతోటే మొదలు కావాలని,ప్రతి ఒక్క కార్యకర్త ఓటర్లను సర్పంచ్,వార్డు అభ్యర్థుల గుర్తులపై ఓటేసి అత్యధిక మెజారిటీ తో గెలిపించాలని అన్నారు.

విలేకరులు కావలెను:

వార్త వేదిక సూర్య దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణలోని ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పనిచేయుటకు రిపోర్టర్లు కావలెను.

యాదాద్రి భువనగిరి: యాదగిరిగుట్ట, యాదగిరిగుట్ట టౌన్, యాదగిరిగుట్ట రూరల్, బొమ్మలరామారం, గుండాల, అడ్డగూడూరు, ఆలేరు, భువనగిరి, భువనగిరి రూరల్, బీబీనగర్, తిరుమలగిరి, స్వర్ణగిరి దేవాలయం, రాజాపేట మండలాల విలేకర్లు కావలెను.

నల్లగొండ : చిట్యాల, నార్కట్‌పల్లి, కనగల్, తిప్పర్తి, మిర్యాలగూడ, మిర్యాలగూడ రూరల్, మాల్, మర్రిగూడెం, చింతపల్లి, గుర్రంపోడు, కోదాడ, సూర్యాపేట, నకిరేకల్, కట్టంగూర్, హుజూర్‌నగర్, మఠంపల్లి, త్రిపురారం, చందంపేట, దిండి మండలాలలో రిపోర్టర్స్ కావలెను.

అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును

పూర్తి వివరాలకు సంప్రదించగలరు.

పోలోజు శ్రీనివాసాచారి
చైర్మన్ & ఎడిటర్.
9985389183

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY



# మానవ హక్కుల పరిరక్షణ మనందరి బాధ్యత

### రాష్ట్ర బిఆర్ఎస్ యూత్ నాయకులు బుర్ర లక్ష్మణ్ గౌడ్

**గుండాల వార్త వేదిక సూర్య డిసెంబర్ 10:** మనందరం పుట్టుకతోనే కలిగి ఉన్న మానవ హక్కుల గురించి తప్పక తెలుసుకోవాలి. వాటిని పరిరక్షించుకోవాలి. వాటికి భంగం కలిగినప్పుడు ప్రతి ఒక్కరూ స్పందించవలసిన అవసరం ఉంది.

ఈ సందర్భంగా రాష్ట్ర బి ఆర్ ఎస్ గుండాల మండల సుద్దాల గ్రామ యూత్ నాయకులు బుర్ర లక్ష్మణ్ గౌడ్ మాట్లాడుతూ ప్రపంచ శాంతి ఒప్పందాలకు అనుగుణంగా ఏర్పడిన ఐక్యరాజ్యసమితి, 1948 డిసెంబర్ 10ని 'అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం'గా ప్రకటించింది. మారుతున్న కాలంతో పాటుగా రాజ్యాంగబద్ధ హక్కుల ముఖ్యోద్దేశ్యమైన పౌర స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, సహజసిద్ధ గౌరవం వంటివి సమాజంలో తగ్గిపోతుండడం విచారకరం. అయితే జాతి, కుల, మత, వర్ణ, వర్గ, లింగ భేదాలకు అతీతంగా ప్రజలు హక్కులు కలిగి ఉన్నారు. వివక్షకు గురికాని క్రూరత్వం నుంచి వెట్టిచాకిరీ, బానిసత్వం వంటి వాటి నుంచి విముక్తి పొంది, పౌరులు స్వేచ్ఛగా వారి ఇష్టానుసారంగా జీవించే, ఏ ప్రాంతంలోనైనా పర్యటించే, జీవించే హక్కులు ప్రజలకున్నాయి. వీటిని నిరోధించడం, లేదా నిర్బంధించడం, వ్యతిరేకించడం వంటివి చట్టవ్యతిరేక చర్యలుగా పరిగణించవచ్చని అన్నారు

అయితే కాలం మారినా కొన్ని ప్రాంతాల్లో ఈ హక్కులకు



అంతరాయం కల్గిస్తూ బాల్య వివాహాలను ప్రోత్సహిస్తూ, కులాంతర వివాహాలను వ్యతిరేకిస్తూ సొంత కుటుంబీకులే అమానుష చర్యలకు పాల్పడడం, తద్వారా హింసాత్మక చర్యలకు దారితీయడం బాధాకరం. కొందరు తమకున్న హక్కులను తెలుసుకోలేకపోవడానికి అవిద్య, అజ్ఞానం కారణాలైతే మరికొన్ని చోట్ల అసూయ, రాగద్వేషాలు, కుల, మత విభేదాలు, గొప్ప-బీద వంటి తారతమ్యాలు కూడా కారణాలుగా కనబడతాయి. అందుకే ఈ హక్కులకు భంగం కలిగినప్పుడు బాధిత వ్యక్తుల రక్షణ కోసం 1993లో 'మానవ హక్కుల పరిరక్షణ చట్టం' ఏర్పాటు చేశారు.

ప్రతి వ్యక్తికీ పుట్టుకతో వచ్చిన స్వేచ్ఛ, సమానత్వంతో పాటూ ఆహారం, ఆరోగ్యం, విద్య వంటి వాటికి కూడా నోచుకోలేని వారు కొందరు ఉన్నారు. గ్రామీణుల నుంచి నగరవాసుల వరకూ చాలా ప్రాంతాల వారికి మానవహక్కులపై అవగాహన, ఆయా హక్కుల ప్రాముఖ్యం తెలియదు. ఇటువంటి వారికి అన్ని విధాలా భద్రత, పౌష్టికాహారం, మెరుగైన వైద్యం వంటివి కల్పించవలసిన బాధ్యత, మానవహక్కుల గురించి తెలియజేయాల్సిన బాధ్యత, ప్రజలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.

మనం మానవ హక్కులను కాపాడుకోవడంతోపాటు ఇతరుల హక్కులనూ గౌరవించాలి. మనం సమాజంలో ప్రజాస్వామ్యం, శాంతి భద్రతలు కాపాడినట్లు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్నేషనల్ సివిల్ రైట్స్ కౌన్సిల్స్ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ చెరుకు రమేష్ డాక్టర్ దివాసులమ నేషనల్ చైర్మన్ సాకెట్ మీరజ గుజరాత్ యూత్ ప్రెసిడెంట్ సయ్యద్ మ్యూజిమినీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రంగ శ్రీనివాస్ గౌడ్ ఉమెన్ అధ్యక్షులు లక్ష్మీ శ్రావణి తెలంగాణ రాష్ట్ర కుల సంఘాలు రాజకీయ నాయకులు మీడియా మిత్రులు పలువురు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది.

# కులమత ఆర్థిక అసమానతలు లేని సమాజం రాజ్యాంగం లక్ష్యం

### మామిడి వెంకట్ రెడ్డి
### లీగల్ ఎయిడ్ కౌన్సిల్ పిలుపు

**వలిగొండ, డిసెంబర్10(వార్తా వేదిక సూర్య):** కుల, మత, లింగ, ప్రాంతీయ, ఆర్థిక, అసమానతలు లేని సమాజం కోసం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగం రచించడం జరిగిందని సమాజంలో అసమానతలు నిర్మూలించేందుకే రాజ్యాంగంలోని ఆర్టికల్ 19,21 24, పెట్టారని లీగల్ ఎయిడ్ కౌన్సిల్ మామిడి వెంకటరెడ్డి అన్నారు. రాజ్యాంగం ఇచ్చిన హక్కులను, వినియోగించు కోవాలని ఆయన అన్నారు. బుదవారం నాడు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ - యాదాద్రి భువనగిరి జిల్లా అదేశాలను సారం మండల న్యాయ సేవా అధికార సంస్థ రామన్నపేట అధ్వర్యంలో మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా తెలంగాణ మోడల్




స్కూల్ పాఠశాల - లోతుకుంట నందు కార్య క్రమం ఏర్పాటు చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ రహిమున్నిసా బేగం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి లీగల్ సర్వీసెస్ ప్యానల్ లాయర్ బర్ల డేవిడ్, మామిడి వెంకట్ రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమం నందు మానవ హక్కుల దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులకి అవగాహన కల్పించారు. పిల్లలు చదువుతో పాటు అన్ని రంగాలలో, ఆటలు, పాటలులో ముందుంటు అన్నింటుపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. మానవ హక్కుల విషయంలో ఎలాంటి ఇబ్బందులూ ఎదురైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన కేంద్ర మానవ హక్కుల కమిషన్, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో లీగల్ సెల్ సభ్యులు బత్తుల గణేష్, కానుగంటి శ్రీశైలం, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.







# కేంద్ర మంత్రులు గడ్కరీ, అశ్విని వైష్ణవ్‌లను కలిసిన ఎంపీ అర్వింద్

- పలు సమస్యలపై విన్నపాలు
- సానుకూలంగా స్పందించిన మంత్రులు

**కోరుట్ల, డిసెంబర్ 10 (వార్త వేదిక సూర్య):** నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు అర్వింద్ ధర్మపురి బుధవారం ఢిల్లీలోని పార్లమెంట్ కార్యాలయంలో కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, అశ్విని వైష్ణవ్ లను వేర్వేరుగా కలిశారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జగిత్యాల జిల్లాలకు సంబంధించి పలు విజ్ఞప్తులను అందజేశారు. కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ని కలిసి నిజామాబాద్ రైల్వే స్టేషన్ లో పిక్లికలిసి నిజామాబాద్ రైల్వే స్టేషన్ లో పిట్ లైన్ ల ఏర్పాటు, పార్లమెంట్ పరిధి గుండా పలు రైళ్ల పొడగింపులు, వందే భారత్ సహా పలు నూతన రైళ్ల మంజూరు, అయ్యప్ప స్వాముల కొరకు కొల్లాంకు ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేయాల్సిందిగా కోరారు. అదేవిధంగా కేంద్ర జాతీయ రహదారులు రవాణా శాఖ మంత్రి గడ్కరీ ని కలిసి జగిత్యాల జిల్లాలో నేషనల్ హైవే 61,63లలో హై లెవెల్ బ్రిడ్జిల నిర్మాణం, అంబారీపేట అంతర్గాం గ్రామాల వద్ద ఫ్లైఓవర్లు అండర్ పాసుల నిర్మాణాలు చేపట్టాల్సిందిగా కోరారు. మంజూరుకు తక్షణమే మౌఖికంగా హామీ ఇచ్చి, సాంకేతికంగా సాంకేతికంగా మంజూరుకు తక్షణ చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

అనంతరం కేంద్ర గిరిజన శాఖ సహాయ మంత్రి దుర్గా దాస్ ఉయికే ను సైతం కలిసిన ఎంపీ జగిత్యాల జిల్లాలో బోర్నపల్లి నుండి జగన్నాథపూర్ వరకు హై లెవెల్ బ్రిడ్జిని చేపట్టాలని కోరగా, గిరిజన మంత్రిత్వ శాఖ ద్వారా నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ అర్వింద్ మంత్రి అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.



# అభివృద్ధి చేసి చూపిస్తా..

### అంతమ్మ గూడెం బిఆర్ఎస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి గుమ్మి

**భూదాన్ పోచంపల్లి డిసెంబర్ 10 (వార్త వేదిక సూర్య):** తనకు ఒక్కసారి అవకాశం కల్పిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని అంతమ్మ గూ డెం బి ఆర్ఎస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ గుమ్మి నరేందర్ రెడ్డి అన్నారు. బుధవారం భూదాన్ పోచంపల్లి మండలం అంతమ్మ గూడెం గ్రామంలో ఇంటింటికి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తనకు ఒక్క సారి అవకాశం కల్పిస్తే గ్రామాన్ని అన్ని రంగాల్లో తీర్చి దిద్దుతానని అన్నారు . గ్రామంలో నెలకొన్న మౌలిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.

గ్రామ ప్రజలందరి సహకారంతో గ్రామ అభివృద్ధికి తోడ్పడతానని అన్నారు. బిఆర్ఎస్ హయాంలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలే గెలుపుకు సహకరిస్తాయని అన్నారు. తనను ఆశీర్వదించి గెలిపించాలని ఓటర్లను కోరారు.

# బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన జువ్వాడి కృష్ణారావు

**కోరుట్ల, డిసెంబర్ 10 (వార్త వేదిక సూర్య):** కోరుట్ల పట్టణానికి చెందిన పోతుగంటి శ్రీనివాస్ గౌడ్ గోడీకే హర్షవర్ధన్ పట్టణ ప్రముఖ వ్యాపారవేత్త నయీం కూతురు ఇటీవల





అనారోగ్యంతో మరణించగా బుధవారం వారి స్వగృహానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు కృష్ణారావు ఇట్టి పరామర్శలో జువ్వాడి కృష్ణారావు తోపాటు కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్ ఉపాధ్యక్షులు ఎంఏ నయీమ్ మాజీ కౌన్సిలర్ ఎంబెరి నాగభూషణం కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు కార్య కర్తలు బాధిత కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





# రాజేంద్రనగర్ నియోజకవర్గంలో రూ.48 లక్షల సీవరేజ్ పైప్‌లైన్ పనులకు ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ శంకుస్థాపన

**మైలర్‌దేవ్‌పల్లి, డిసెంబర్ 10 (వార్త వేదిక సూర్య):** రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో రూ.48 లక్షల వ్యయంతో మైలార్దేవరుపల్లి డివిజన్ హౌసింగ్ బోర్డ్ కాలనీలోని స్మశాన వాటిక వద్ద చేపట్టనున్న సీవరేజ్ పైప్‌లైన్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ.. హౌసింగ్ బోర్డ్ కాలనీ పరిసర ప్రాంతాల్లో సీవరేజ్ సమస్యలు తరచూ ఎదురవుతున్న నేపథ్యంలో ప్రజల అభ్యర్థనపై ఈ ప్రాజెక్టును ప్రభుత్వం ఆమోదించిందన్నారు. రూ.48 లక్షల నిధులతో ఈ పనులను అత్యాధునిక ప్రమాణాలతో పూర్తి చేసి, కాలనీ నివాసులకు శాశ్వత పరిష్కారం కల్పించనున్నట్లు చెప్పారు. ప్రజల మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.





# బిఆర్ఎస్ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థుల జాబితా విడుదల

**మోత్కూరు, డిసెంబర్ 10(వార్తా వేదిక సూర్య):** మండలంలోని 10 గ్రామపంచాయతీ బి.ఆర్.ఎస్ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థులను ఆ పార్టీ మండల అధ్యక్షులు పోన్నెబోయిన రమేష్ బుధవారం నాడు ఒక ప్రకటన తెలిపారు. పనకబండ బిబి లోతుకుంట రేణుక అనిల్ కుమార్ రాగిబావి బి మెండు శ్రీవాణి చంద్రశేఖర్ రెడ్డి పాటిమట్ల బి -గిరగాని ఉమా శ్రీనివాస్ దాచారం బి చిల్లర లింగమ్మ వీరయ్య, ముషిపట్ల బినోముల బుగ్గరాములు సదర్శాపురం -బిచిలుకల సురేష్, పాలడుగు - మరిపెల్లి శేఖర్, పొడిచేడు -మెట్టు వీరస్వామి, అనాజీపురం -చింతకింది చంద్రమౌళి, దత్తప్పగూడెం -లోకసాని ఉదయ్ కుమార్ రెడ్డి లను ఎంపిక చేసినట్లు రమేష్ తెలిపారు.

# ప్రభుత్వ ఉద్యోగులు 12,13 తేదీలలో పోస్టల్ బ్యాలెట్‌ను ఉపయోగించుకోవాలి

### - ఎంపీడీవో బాలాజీ నాయక్



**మోత్కూరు, డిసెంబర్ 10(వార్త వేదిక సూర్య):** మోత్కూరు మండలంలోని 3విడత లో ఈ నెల 17 న జరగనున్న గ్రామపంచాయతీ రెండవ సాధారణ ఎన్నికలకు విధులకు హాజరయ్యే ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ఓటు వేయడానికి ఈనెల 12 13 తేదీలలో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించినట్లు ఎంపీడీవో బాలాజీ నాయక్ తెలిపారు. బుధవారం నాడు ఆయన విలేకరులతో మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికలకు విధులకు హాజరయ్యే ప్రభుత్వ ఉద్యోగులు ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# అన్నా.. అక్కా.. నీ ఓటు నాకే

### దంతూరు గ్రామ సర్పంచ్ బిఆర్ఎస్ అభ్యర్థి బత్తుల మాధవి శ్రీశైలం గౌడ్

**భూదాన్ పోచంపల్లి, డిసెంబర్ 10 ( వార్త వేదిక సూర్య)** అన్నా... అక్కా... మీ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని దంతూరు బి ఆర్ ఎస్ బలపరిచిన గ్రామ సర్పంచ్ అభ్యర్థి బత్తుల మాధవి శ్రీశైలం గౌడ్ ఓటర్లను అభ్యర్థించారు . బుధవారం భూదాన్ పోచంపల్లి మండలం దంతురు గ్రామంలో స్థానిక నాయకులు కార్యకర్తలతో కలసి ఇంటింటికి విస్తృతంగా ప్రచారం



నిర్వహించారు. తమ కు కేటాయించిన కత్తెర గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. బి ఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని అన్నారు. ప్రజలందరూ ఆశీర్వదించి తమకు ఒక్కసారి అవకాశం కల్పించాలని కోరారు . ఈ కార్యక్రమంలో నాయకులు నాయకులు , సిద్ధగోని లింగస్వామి , కంబాల సత్తయ్య,గంగదారి మురళీకృష్ణ, బింగి శివ, జాల శ్రీశైలం, బోదాసు బాలరాజు, పాక నరసింహ, మాకోలు రాజు, సిద్ధగోని వెంకటేష్ , సిద్ధగోని నర్మదా సైదులు, పాక లింగస్వామి, వార్డ్ మెంబర్ అభ్యర్థులు పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు .

# రామన్నపేట అభివృద్ధి బిఆర్ఎస్‌తోనే సాధ్యం

### - మిర్యాల మల్లేష్ బిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి

**రామన్నపేట,డిసెంబర్ 10 (వార్త వేదిక సూర్య):** రామన్నపేట మండల కేంద్రంలోని 6,7,8 వ వార్డులలో ప్రచారం నిర్వహించిన బిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి మిర్యాల మల్లేశం.ప్రచారంలో భాగంగా మాట్లాడుతూ తనను గెలిపిస్తే రామన్నపేటలో అండర్



గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయించి ప్రభుత్వం ఇచ్చే ప్రతి పథకం నిజమైన పేదవాడికి అందే విధంగా చూస్తా, ప్రభుత్వ ఆసుపత్రి లో డాక్టర్లు పూర్తిస్థాయిలో ఉండే విధంగా చేస్తానని,నీటి సమస్యను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని, తాను గతంలో వార్డు సభ్యునిగా ఉన్నందున గ్రామంలోని ప్రతి వార్డు లో గల సమస్యలు తన దృష్టిలో వున్నాయని, వాటిని పరిష్కరించే విధంగా ఒక నిర్ధిష్టమైన ప్రణాళికతో ముందుకు వెళ్తానని,రామన్నపేటను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

# శివాలయానికి రూ.21,116/- విరాళం

**కోరుట్ల,డిసెంబర్ 10 (వార్త వేదిక సూర్య):** రూ.3 కోట్ల వ్యయంతో అయ్యప్ప ఆలయ ఆవరణలో నిర్మించనున్న ద్వాదశ జ్యోతిర్లింగ సహిత శ్రీ శివాలయానికి స్థానిక వాస్తవ్యులు, లాగిన్ ఫ్యాషన్ అధినేత శ్రీ చౌల అనీల్-చైతన్య దంపతులు తమ కన్నె స్వామి దీక్షా పడిపూజ సందర్భంగా రూ. 21,116/లు విరాళం సమర్పించారు.



## నల్గొండ జిల్లాలో ఊపందుకున్న

# ప్రీ మెట్రిక్ స్కాలర్షిప్‌ల దరఖాస్తులు

**జిల్లా కలెక్టర్ చొరవతో 6 రోజుల్లో 6 శాతం నుండి 28% కిచేరుకున్న దరఖాస్తులు**

**పీఏ పల్లిలో అత్యధికంగా 90% దరఖాస్తులు**

**అర్హులైన విద్యార్థులందరికీ ప్రిమెట్రిక్ స్కాలర్షిప్‌లు వచ్చేందుకు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కృషి**

నల్లగొండ, డిసెంబర్ 10 (వార్త వేదిక సూర్య): జిల్లాలోని పేద విద్యార్థులు ఉపకార వేతనాలు పొందేందుకు గాను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. జిల్లాలో మండలాల వారిగా 13,194 మంది విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించాల్సి ఉండగా, గత వారం వరకు కేవలం 6% మాత్రమే ఉన్న ఉపకార వేతనాల దరఖాస్తులు 6 రోజుల్లో 28 శాతానికి పెరిగాయి. ఇందుకు జిల్లా కలెక్టర్ వారంలో రెండుసార్లు ఉపకార వేతనాలపై విద్యాశాఖ అధికారులు, సంక్షేమ అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశాలు నిర్వహించి దరఖాస్తుల అప్ లోడ్ పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. ప్రత్యేకించి పీఏ పల్లి మండలంలో 90 శాతం దరఖాస్తుల స్వీకరణను పూర్తి చేసి ముందు వరుసలో నిలిచింది. అనంతరం తిరుమలగిరి సాగర్, ఇతర మండలాలు దరఖాస్తుల స్వీకరణ లో ముందున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో పేద వర్గాల నుంచి వచ్చిన విద్యార్థులు ఉంటారని, అందువల్ల వారందరూ ఉపకార వేతనాలు పొందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, ప్రత్యేకించి హెడ్మాస్టర్లు విద్యార్థులతో బ్యాంకు ఖాతాలు ప్రారంభించి కులము ధ్రువపత్రాలు ఇతర ధ్రువ పత్రాలతో ఉపకార వేతనాలకు దరఖాస్తు చేయించాలన్నారు. ఇందుకు గాను విద్యాశాఖ అధికారులు బ్యాంకు అధికారులు,రెవెన్యూ,సంక్షేమ అధికారులతో సమన్వయం చేసుకుని త్వరితగతన ఉపకార వేతనాలకు దరఖాస్తులు చేసుకునేలా చూడాల్సిన బాధ్యత ఉందని ,సాధ్యమైనంత త్వరగా నూటికి నూరు శాతం ఉపకార వేతనాలు పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటివరకు 13194 గాను,



3711 మంది విద్యార్థులు ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకున్నారని, తక్కిన వారి చేత దరఖాస్తులను సమర్పించే విధంగా చర్యలు చేపట్టాలని ఆమె ప్రకటనలో కోరారు. ఇందుకు విద్యాశాఖ అధికారులతో పాటు, సంక్షేమ శాఖ అధి కారులు,బ్యాంక్ అధికారులు సహకరించాలని, తహసిలా ద్రులు సైతం విద్యార్థులకు అవసరమైన కుల ధ్రువపత్రాలను జాప్యం లేకుండా జారీ చేయాలని చెప్పారు.

# ఆశీర్వదించండి అభివృద్ధి చేస్తా..

**- స్వతంత్ర అభ్యర్థి దీపిక నరసింహ**

**దన్నారం గ్రామ సర్పంచ్ అభ్యర్థికి కత్తెర గుర్తుపై ఓటు వేసి గెలిపించండి : దీపిక నరసింహ**

మహేశ్వరం, డిసెంబర్ 10 (వార్త వేదిక సూర్య): మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండలం దన్నారం గ్రామ ప్రజలు ఆశీర్వదించి గెలిపిస్తే అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని దన్నారం గ్రామపంచాయతీ స్వతంత్ర సర్పంచ్ అభ్యర్థి దీపిక నరసింహ మాట్లాడుతూ అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం లక్ష్యంగా పనిచేస్తానని ముఖ్యంగా పారిశుధ్య నిర్వహణ. కాలువలు, తాగునీటి సౌకర్యం. సిసి రోడ్లు. ప్రజల కు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కోసం కృషి చేస్తానని అన్నారు. గ్రామాన్ని మరింత అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని అన్నారు. దన్నారం గ్రామపంచాయతీ ఆదర్శవంత మైన గ్రామంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానని గ్రామ అభివృద్ధి మరింతగా జరుగుతుందని అధిక నిధులు తీసుకొచ్చే గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపించడానికి



నా వంతు కృషి చేస్తానని మంద దీప నరసింహ అన్నారు.

గ్రామ అభివృద్ధి కోసం ప్రజలకు సేవ చేయడానికి ముందుకు వస్తున్నానని మీ అమూల్యమైన ఓటు కత్తెర గుర్తుకు వేసి ఆశీర్వదించి గెలిపించాలని మంద దీపా నరసింహ కోరారు.





# వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

**ఇబ్రహీంపట్నం కోర్టు జడ్జి హిమబిందు**

ఎల్‌బినగర్, డిసెంబర్ 10(వార్త వేదిక సూర్య): న్యాయశాస్త్రం అభ్యసించిన విద్యార్థులు భవిష్యత్తులో తమ వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఇబ్రహీంపట్నం ఫస్ట్ క్లాస్ అడిషనల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఎం. హిమబిందు అన్నారు. చైతన్యపురిలోని తెలంగాణ గురుకుల మహిళ న్యాయ కళాశాలలో మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా బుధవారం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. మానస ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరై ఆమె మాట్లాడారు. తమ ఉపన్యాసంతో న్యాయ విద్యార్థులకు మానవహక్కుల ప్రాధాన్యత న్యాయపరంగా ఏ విధమైన చర్యలు చేపట్టవచ్చునని వివరించారు. మానవ హక్కుల గురించి విద్యార్థులు స్కిట్లు, పాటలు, నృత్యం ప్రదర్శన చేసారు.

ఈకార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పి.కవిత, కే ప్రభాకర్ విద్యార్థులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయితీ ఎన్నికల నిర్వహణకు

# 2000 మందితో పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు

**సమస్యాత్మక పోలింగ్ కేంద్రం అప్పాజీ పేట గ్రామాన్ని సందర్శించిన జిల్లా ఎస్పీ**

**శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు**

**జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్**

నల్లగొండ , డిసెంబర్ 10 (వార్తా వేదిక సూర్య): జిల్లా లో గ్రామపంచాయతీ ఎన్నికలు ఫ్రీ అండ్ ఫేర్ ఎన్నికల నిర్వహణ లక్ష్యంగా పోలీస్ శాఖ పటిష్ట బందోబస్తు నిర్వహించడం జరిగిందని. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. నల్లగొండ రూరల్ పరిధిలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రమైన అప్పాజీ పేట గ్రామం సందర్శించి మాట్లాడుతూ.. మొదటి విడతలో భాగంగా 318 గ్రామ పంచాయితీలలో 466 పోలింగ్ కేంద్రాలు, 2870 పోలింగ్ స్టేషన్ లలో ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రతి మండలానికి సూమరు 150 చొప్పున 2000 మంది పోలీస్ సిబ్బందితో రూట్ మొబైల్స్, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ ఏర్పాటు చేసి ఎన్నికల ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా పటిష్టమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు.





జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుటకు క్రిటికల్ పోలింగ్ గ్రామాలలో ఫ్లాగ్ మార్చ్‌లు నిర్వహించి ఎన్నికలపై ప్రజల్లో భరోసా కల్పించడం జరిగిందని అన్నారు. ఎన్నికల సమయంలో ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన, గొడవలు, అల్లర్లు సృష్టించిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలింగ్ కేంద్రాల వద్ద 163 బిఎన్ఎస్ఎస్ (144 సెక్షన్) అమలులో ఉంటుందని 100 మీటర్ల వద్ద 200 మీటర్ల వద్ద ప్రత్యేక నియమ నిబంధనలు ఉంటాయని వాటిని పాటించాలని, ప్రజల అనవసరంగా గుమిగూడి ఉండరాదని తెలిపారు. పోలింగ్ కేంద్రాలలోనికి సెల్ఫోన్లు, వాటర్ బాటిల్ లు, ఇంకు బాటిల్లు, పెన్నులు, అగ్నికి సంబంధించిన వాటికి అనుమతులు ఉండవని తెలిపారు. ఎలాంటి సమాచారం అయినా డయల్ 100 ద్వారా పోలీసులకు తెలియజేయాలని కోరారు.

# ఎన్నికల సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి

నల్లగొండ,డిసెంబర్ 10 (వార్త వేదిక సూర్య): మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్న దేవరకొండ డివిజన్లోని 9 మండలాలలో



విధులు నిర్వహించే సిబ్బంది ర్యాండమైజేషన్ కార్యక్రమాన్ని గ్రామపంచాయతీ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకురాలు కోర్రా లక్ష్మి సమక్షంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కలెక్టర్ చాంబర్లో నిర్వహించడం జరిగింది. చందంపేట, చింతపల్లి, దేవరకొండ, గుడిపల్లి ,గుండ్లపల్లి, గుర్రంపోడు, కొండమల్లేపల్లి, నేరేడుగోమ్ము, మండలాలలోని 2206 పోలింగ్ కేంద్రాలలో ఎన్నికలు జరగనున్నాయి. ఇందుకుగాను 2647 మంది పిఓలు ,2959 మంది ఓపిఓలను విధులకు నియమించడం జరిగింది. వీరికి సంబంధించి రెండవ విడత ర్యాండమైజేషన్ నిర్వహించడం జరిగింది. జిల్లా సాధారణ పరిశీలకురాలు సమ్మతితో ఈ ర్యాండమైజేషన్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తో పాటు, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, జెడ్పి సీఈవో శ్రీనివాసరావు, దేవరకొండ ఆర్ డివో రమణారెడ్డి, డీఈఓ బిక్షపతి ,నల్గొండ ఆర్డీవో వై. అశోక్ రెడ్డి కలెక్టర్ కార్యాలయ ఏ ఓ మోతిలాల్,ఈ డి ఎం దుర్గారావు, ఎన్ఐసి అధికారి ప్రేమ్ తదితరులు ఈ ర్యాండమైజేషన్ కార్యక్రమానికి హాజరయ్యారు.

# మొదటి విడత ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

నల్లగొండ,డిసెంబర్ 10 (వార్త వేదిక సూర్య): నల్గొండ జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలలో భాగంగా మొదటి విడతన 14 మండలాలలోని 318 గ్రామపంచాయతీలలో ఎన్నికలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. బుధవారం ఆమె నల్గొండ జిల్లా కేంద్రంలోని జూలకంటి ఇంద్రారెడ్డి ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన ఎన్నికల పోలింగ్ సామాగ్రి పంపిణీ, స్వీకరణ (డి ఆర్ సి) కేంద్రాన్ని తనిఖీ





చేశారు. మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలలో విధులు నిర్వహించేందుకు సుమారు 7000 మంది సిబ్బందిని నియమించడం జరిగిందని ,ఈ ఎన్నికలలో 5600 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారని తెలిపారు. ప్రతి మండలానికి ఒక డిఆర్సి కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, అంతేకాక ఒక్కో మండలానికి రూట్ అధికారులతో పాటు, ఇద్దరు లేదా ముగ్గురు జోనల్ అధికారులను సైతం నియమించామని ,ఎన్నికల సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు కలెక్టర్ కార్యాలయంలో కాల్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. ప్రతి రెండు గంటలకు ఒకసారి టి పోల్ లో పోలింగ్ శాతాన్ని నమోదు చేసేందుకు ఏర్పాట్లు చేశామని, పోలింగ్ సిబ్బంది బుధవారం సాయంత్రమే సంబంధిత పోలింగ్ కేంద్రాలకు వెళ్తారని, వారికి అవసరమైన భోజనం, వసతి అన్ని ఏర్పాట్లు చేశామని, అంతేకాక ప్రత్యేకంగా వారికి ఉపయోగపడే బ్రష్,పేస్ట్ వంటివాటితో కిట్ కూడా ఇస్తున్నట్లు తెలిపారు.

పోలింగ్ సిబ్బంది స్టాచ్యుటరీ, నాన్ స్టాచ్యుటరీ మెటీరియల్‌ను సరిగా చూసుకోవాలని, ఒకవేళ ఏదైనా మెటీరియల్ సరిపోకపోతే తక్షణమే ఎంపీడీవోను లేదా డిఆర్డిఓను సంప్రదించాలన్నారు.

పోలింగ్ నిర్వహణ సమయంలో ఎలాంటి వివాదాలకు తావివ్వకుండా చూడాలని, పోలింగ్ కేంద్రం నుండి ఎలాంటి పేపర్లు బయటకు వెళ్లకుండా చూసుకోవాలన్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన ప్రకారం పోలింగ్ ను ప్రారంభించాలని, ఒకసారి ప్రతిపాదించిన ఏజెంట్లను ఎట్టి పరిస్థితులను మార్చవద్దని అన్నారు. టెండర్, ఛాలెంజ్ ఓట్ల విషయంలో పూర్తి జాగ్రత్తగా ఉండాలని, ఏవైనా గొడవలు జరిగేందుకు ఆస్కారం ఉంటే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఎవరికైనా వైద్య పరమైన అత్యవసర పరిస్థితి ఏర్పడితే తక్షణమే పిహెచ్‌సి డాక్టర్‌కు సమాచారం అందించాలని తెలిపారు. ప్రతి పోలింగ్ టీము వారికి సంబంధించిన రూటు, జోనల్ అధికారుల ఫోన్ నంబర్లు కలిగి ఉండాలని చెప్పారు.

ఓటర్లు ఓటు వేసేందుకు ఎన్నికల సంఘం ఆమోదించిన 14 కార్డులలో ఏదో ఒక కార్డును గుర్తింపుగా చూపించి ఓటు హక్కు వినియోగించుకునే విధంగా అనుమతించాలన్నారు. పోలింగ్ ముగిసిన వెంటనే కౌంటింగ్ కు ఏర్పాటు చేయాలని, వెంటనే ఉప సర్పంచ్ ఎన్నిక పూర్తి చేయాలని చెప్పారు. జిల్లా కలెక్టర్ వెంట జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, జెడ్పి సీఈవో శ్రీనివాసరావు, పశుసంవర్ధక శాఖ అధికారి రమేష్ ,తహసిల్దార్ పరుశురాం, ఎంపీడీవో యాకూబ్ తదితరులు ఉన్నారు.

# గోపరాజుపల్లిలో సర్పంచ్ అభ్యర్థి నీలం నరేందర్ విస్తృత ప్రచారం

రామన్నపేట,డిసెంబర్ 10 (వార్త వేదిక సూర్య): గోపరాజుపల్లి గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి బుధవారం నాడు 7వ వార్డులో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లను కలిసి ఆశీర్వాదం కోరారు.తనను సర్పంచ్‌గా ఎన్నుకుంటే గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. వార్డులలో ఉన్న ప్రధాన సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. “మహిళలకు, యువతకు ప్రాధాన్యతనిస్తూ, ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా అందేలా కృషి చేస్తాను. అభివృద్ధికి ఒక అవకాశం ఇవ్వండి, అని వారు ఓటర్లను కోరారు.



# దూరంగా ఉన్న పోలింగ్ కేంద్రాలకు ముందుగా మెటీరియల్‌ను పంపించాలి

**- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి**

నల్లగొండ,డిసెంబర్ 10 (వార్త వేదిక సూర్య): గ్రామపంచాయతీ ఎన్నికల సామాగ్రి పంపిణీలో భాగంగా దూరంగా ఉన్న పోలింగ్ కేంద్రాలకు ముందుగా మెటీరియల్ ను పంపించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. బుధవారం ఆమె మునుగోడు మండల కేంద్రంలోని సైంట్ జోసెఫ్ పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రామపంచాయతీ ఎన్నికల డిఆర్సి కేంద్రాన్ని తనిఖీ చేసి అక్కడ ఎన్నికల పోలింగ్ సామాగ్రి పంపిణీ, స్వీకరణకు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. పోలింగ్ సిబ్బందికి సామాగ్రిని పంపిణీ చేసే సమయంలో స్టాట్యూటరీ,నాన్ స్టాట్యూటరీ పేపర్ల ప్రాధాన్యతను తెలియజేయాలని, అలాగే ప్రతి పోలింగ్ టీం వారికి సంబంధించిన జోనల్ అధికారి, రూట్ అధికారుల ఫోన్ నెంబర్లు కలిగి ఉండాలని తెలిపారు. ప్రిసైడింగ్ అధికారులు పి ఓ డైరీ నిర్వహణ,టెండర్,ఛాలెంజ్ ఓట్ల



విషయంలో తీసుకొనే జాగ్రత్తలు మరోసారి తెలియజేయాలని చెప్పారు. పోలింగ్ కేంద్రాలలో సిబ్బందికి కి ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. ఒకవేళ మెటీరియల్ సరిపోకపోతే తక్షణమే



ఎంపీడీవో దృష్టికి తీసుకురావాలన్నారు.జిల్లా కలెక్టర్ వెంట జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, జెడ్పిసిఈఓ శ్రీనివాసరావు, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, చండూరు ఆర్డీవో శ్రీదేవి, తదితరులు ఉన్నారు.



## పంచాయతీ ఎన్నికల డిఆర్సీ కేందాలను

# తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

గట్టుప్పల,డిసెంబర్ 10 (వార్త వేదిక సూర్య): గట్టుప్పల మండల కేంద్రంలో డిఆర్సి సెంటర్ ను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు.మొదటి విడత ఎన్నికల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులు సిబ్బంది కి ఆదేశించారు. ఎలాంటిపొరపాట్లకు తావివ్వకుండా జాగ్రత్తగా ఎన్నికల సామగ్రి పంపిణీ చేయాలని ఆదేశించారు. స్టాచ్యుటరి నాన్ స్టాచ్యుటరి పేపర్లతో పాటు ఓటరు కంపార్ట్మెంట్ మెటీరియల్ ఇండెలిబుల్ ఇంకు బాటిళ్ల తదితర సామగ్రి పై అరా తీశారు.పిఓ డైరీని జాగ్రత్తగా రాయాలని పీఓలకు పోస్టల్ బ్యాలెట్ ఓటరు జాబితా అంశంపై సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు తో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తో పాటు పంచాయతీ అధికారి వెంకయ్య, జెడ్పీ సీఈఓ శ్రీనివాస్ రావు, డిఆర్డీఓ శేఖర్ రెడ్డి, చండూరు ఆర్డీవో శ్రీదేవి. ఎంపిడివో వసంత లక్ష్మీ, ఎస్సై సంజీవ రెడ్డి పాల్గొన్నారు.

## విజన్ 2047లో భాగంగా ప్రజా రవాణాను

# 28 శాతం నుండి 70 శాతానికి పెంచాలి

- ప్రజా రవాణా మరింత ప్రజల్లోకి తీసుకెళ్లాలి ఆర్టీసీ ఉద్యోగులు మరింత కష్టపడాలి..
- ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కరిస్తాం...
- ఆర్టీసీ ఉద్యోగుల పిల్లలకు అధునాతన సౌకర్యాలతో ఆర్టీసీ స్కూల్ ఏర్పాటుకు కృషి చేస్తా
- సంస్థ పరిరక్షణ,ఉద్యోగుల సంక్షేమం, ప్రయాణికుల సౌకర్యం మా ప్రధాన లక్ష్యం
- మహాలక్ష్మి పథకం ప్రారంభమై రెండేళ్ళ పూర్తి చేసుకున్న సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులకు సిబ్బందికి అభినందనలు, శుభాకాంక్షలు తెలిపి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడిన మంత్రి పొన్నం ప్రభాకర్





**హైదరాబాద్, (వార్త వేదిక సూర్య):** మహాలక్ష్మీ పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ప్రారంభమై రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బస్ భవన్ నుండి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 97 డిపోల్లో ఉన్న ఆర్టీసీ అధికారులు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

మహా లక్ష్మీ పథకం విజయవంతానికి నిరంతరం శ్రమిస్తున్న డ్రైవర్లు, కండక్టర్లు, శ్రామిక్ ఇతర సిబ్బందిని మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. రవాణా శాఖ మంత్రి గా రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్ కు ఎండీ , ఈడి లు సత్కరించారు. ఆర్టీసీని మరింత విస్తృత పర్చాలని క్షేత్ర స్థాయిలో రాజధాని నుండి గ్రామాల వరకు ఆర్టీసీ కొత్త రూట్లను అన్వేషించి ప్రజల అవసరాలకు అనుగుణంగా బస్సులు నడిపించేలా కార్యాచరణ తీసుకోవాలని ఆదేశించారు.

ఇందుకోసం ఇప్పటికే హైదరాబాద్ నగరంలో గత మూడు నెలలుగా సర్వే చేసి 373 కొత్త రూట్లలో ఈరోజు నుండి ప్రజా రవాణా అయిన ఆర్టీసీ బస్సులు నడిపిస్తున్నట్లు పేర్కొన్నారు. దీని ద్వారా రింగ్ రోడ్డు వెలుపల ఉన్న దాదాపు 7 లక్షల మందికి కొత్తగా ప్రజా రవాణా సౌకర్యం ఏర్పడిందని హర్షం వ్యక్తం చేశారు.

కొత్త రూట్లలో బస్సులు నడిపినప్పుడే విజన్ 2047 లో మన లక్ష్యాలకు అనుగుణంగా ఇప్పుడున్న 28 శాతం ప్రజా రవాణా ను 70 శాతానికి పెంచుకోవడానికి సాధ్యం అవుతుందని సూచించారు. అందుకోసం ఇపుడున్న ఆర్టీసీ మూడింతల వ్యవస్థ అవసరమని అందుకు ఉద్యోగులు సిబ్బంది కృషి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. తమకు సంస్థ పరిరక్షణ ,ఉద్యోగుల సంక్షేమం, ప్రయాణికుల సౌకర్యం ప్రథమ కర్తవ్యమని ప్రయాణికుల విషయంలో ఆర్టీసీ సిబ్బంది స్నేహ పూర్వకంగా ఉండాలని సూచించారు. అటు అధికారులు సైతం ఆర్టీసీ సిబ్బంది విషయంలో కఠినంగా కాకుండా కుటుంబ సభ్యుల మాదిరి వ్యవహరించాలని అప్పుడే వారు సంస్థ కోసం మరింత పనిచేస్తారని తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగుల మీద దాడి చేస్తే కఠిన చర్యలు తప్పవని ఇటీవల సిరిసిల్ల లో జరిగిన ఘటనలో డ్రైవర్ కి సంస్థ అండగా ఉందన్నారు. మీ ప్రతినిధిగా ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వంతో చర్చిస్తున్నానని ఆర్థిక పరమైన అంశాలు కూడా ఎప్పటికప్పుడు పరిష్కారం చేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. గత 10 సంవత్సరాలుగా ఆర్టీసీని నిర్వీర్యం చేసి సంస్థ ఉనికికే ప్రశ్నార్థకంగా మారిందని ప్రజా పాలన ప్రభుత్వం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో మహా లక్ష్మీ పథకం ద్వారా 90 కి పైగా డిపోలు లాభాల బాటలో ఉన్నాయని తెలిపారు. మిగిలిన డిపోలు కూడా లాభాల్లోకి వచ్చేలా పని చేయాలని ఆదేశించారు.

గతంలో 2011 లో నియామకాలు జరిగితే తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పుడు 3038 పోస్టులకు డ్రైవర్ , శ్రామిక్, సూపర్ వైజర్ పోస్టులకు నియామకాలు జరుగుతున్నాయని ,2014 తరువాత మళ్ళీ తమ ప్రభుత్వం ఈ రెండు సంవత్సరాల కాలంలో 2476 నూతన బస్సులు కొనుగోలు చేశామని తెలిపారు. అంటే ఇప్పుడున్న బస్సుల్లో 40 శాతం ఈ రెండేళ్ళకాలంలో వచ్చినవే అని, సంస్థ లో కారుణ్య నియామకాలు కింద బ్రెడ్ విన్నర్ స్కిం కింద 800 మెడికల్ అన్ ఫిట్ కింద 390 మంది మొత్తం 1190 మందిని నియమించామని తెలిపారు. 2047 విజన్‌లో ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లో రవాణా శాఖ కీలక పాత్ర పోషించాలని తెలిపారు. దేశంలో అత్యున్నత సంస్థగా ఆర్టీసీ ఎదగాలని ఆశించారు. బస్ స్టేషన్ ల ముందు ప్రైవేట్ వెహికిల్ లలో ప్రయాణికులను తరలిస్తే కేసులు బుక్ చేసి వాహనాలు సీజ్ అయ్యేలా రవాణా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆర్టీసీ పిల్లలు చదువుకోవడానికి ప్రత్యేకంగా ఆర్టీసీ స్కూల్ ఉండేలా ప్రభుత్వంతో మాట్లాడతానని తెలిపారు. సమీక్షా సమావేశంలో ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఈడీలు మునిశేఖర్, వెంకన్న, రాజశేఖర్, ఇతర ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

---

## తుంగతుర్తిలో కాంగ్రెస్ హత్యా

# రాజకీయాలు సహించేది లేదు

- ఓటమి భయంతోనే కాంగ్రెస్ భౌతిక దాడులు.. ఉప్పుల మల్లయ్య హత్య అత్యంత హేయం
- పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం.. ఎవరూ అధైర్యపడవద్దు
- మాజీ మంత్రి జగదీష్ రెడ్డి, గాదరి కిషోర్‌లతో మాట్లాడి పరిస్థితులను ఆరా తీసిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్
- దాడికి పాల్పడిన వారిపై పోలీసులు వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని, బాధితులకు తక్షణమే న్యాయం చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్



**హైదరాబాద్, (వార్త వేదిక సూర్య):**

సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ సాగిస్తున్న హత్యా రాజకీయాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో నూతనకల్ మండలం లింగంపల్లి గ్రామంలో బీఆర్ఎస్ శ్రేణులపై జరిగిన దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ దాడిలో బీఆర్ఎస్ కార్యకర్త ఉప్పుల మల్లయ్య ప్రాణాలు కోల్పోవడం పట్ల కేటీఆర్ గారు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలను ఎదుర్కోలేక, భౌతిక దాడులకు దిగడం కాంగ్రెస్ పార్టీ దిగజారుడుతనానికి నిదర్శనం. అధికార మదంతో కాంగ్రెస్ గూండాలు సాగిస్తున్న అరాచకాలను బీఆర్ఎస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించదు," అని కేటీఆర్ హెచ్చరించారు

గత రాత్రి లింగంపల్లి గ్రామంలో సుమారు 70 మంది కాంగ్రెస్ కార్యకర్తలు కర్రలు, రాళ్లతో బీఆర్ఎస్ నాయకులే లక్ష్యంగా విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఉప్పుల మల్లయ్య మృతి చెందగా, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మున్నా మల్లయ్య యాదవ్ తో పాటు మరో 15 మంది కార్యకర్తలకు తీవ్ర గాయాలయ్యాయి.

### కార్యకర్తలకు కేటీఆర్ భరోసా

ఈ ఘటన తెలిసిన వెంటనే కేటీఆర్ మాజీ మంత్రి జగదీష్ రెడ్డి, స్థానిక మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ లతో ఫోన్లో మాట్లాడి క్షేత్రస్థాయి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. "పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు, నాయకుడికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుంది. ఎవరూ అధైర్య పడవద్దు. మరణించిన కార్యకర్త కుటుంబానికి మరియు గాయపడిన వారికి పార్టీ అన్ని విధాలా అండగా నిలుస్తుంది," అని కేటీఆర్ భరోసా ఇచ్చారు. దాడికి పాల్పడిన వారిపై పోలీసులు వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని, బాధితులకు తక్షణమే న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

---

## ఎంఎల్‌ఏ కృష్ణారావు ఆరోపణలకు ఫీలవ్వను

### -ప్రెస్ మీట్‌లో అన్నీ చెబుతా: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**హైదరాబాద్, (వార్త వేదిక సూర్య):**

కృష్ణారావు నన్ను వ్యక్తిగతంగా టార్గెట్ చేయటం ఆయన ఫ్రస్ట్రేషన్ ను బయట పెడుతోంది. ఆయన చేసిన అన్ని ఆరోపణలకు ఆధారాలతో సహా వివరణ ఇస్తా. ఆ మాటలకు ఫీలయ్యేది లేదు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. రాష్ట్రంలో పాలక పక్షం, ప్రతిపక్షం పనిచేస్తలేవు. జనం గళంగా జాగృతి పనిచేస్తుంది. కూకట్ పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు చేసిన విమర్శలపై నేను ఆధారాలతో సహా సమాధానం చెప్తాను. ఆయన చేసిన ప్రతి ఆరోపణకు డాక్యుమెంట్లతో సహా ప్రెస్ మీట్ పెడతాను. కూకట్ పల్లి 15 ఏళ్లుగా ఉన్న సమస్యలనే నేను చెప్పాను. ఆయన మాట్లాడిన మాటాలకు ఫీలయ్యేది లేదు. ప్రజలు అన్ని



గమనిస్తున్నారు. జాగృతి జనం బాటలో భాగంగా ఐదు రోజుల పాటు హైదరాబాద్ జిల్లాలో పర్యటిస్తాం. ఇవ్వాళ మనం కంటోన్మెంట్ లోని బోయినపల్లి గవర్నమెంట్ స్కూల్ లో ఉన్నాం.

మన ఊరు- మన బడి కార్యక్రమంలో భాగంగా ఈ స్కూల్ ను బాగు చేశారు. కానీ కాంపౌండ్ వాల్, సీసీ కెమెరాలు లేవు. వాటిని మేము ఏర్పాటు చేస్తాం. ఈ స్కూళ్లోనే అంగన్ వాడీని కూడా కలిపారు. అంగన్ వాడీలో హెల్పర్లు లేరు. జనం బాటలో భాగంగా విద్య, వైద్యం మీద ఫోకస్ పెట్టాం. స్కూల్స్, హాస్పిటల్స్‌లో మౌలిక వసతులు ఎలా ఉన్నాయన్నది పరిశీలిస్తున్నాం. ఇండ్లు, ఇళ్ల పట్టాలను లేని వారి సమస్యలు కూడా తెలుసుకుంటున్నాం.

మా వరకు చేయగలిగేది మేము ఒక సంస్థ గా చేస్తాం. టాప్ టెన్ విద్యార్థులకు మా తరపున స్కాలర్ షిప్ లు ఇస్తాం. అదే విధంగా ప్రభుత్వం సాధించే వాటిని కూడా మేం చేయిస్తాం. ఏ జిల్లా కు వెళ్లిన ప్రజల నుంచి ఆదరణ, సమస్యలు పరిష్కరించే అవకాశం ఉంటోంది. ప్రజల సమస్యలను వీలైనంతగా మేము పరిష్కరిస్తాం. గత ప్రభుత్వంలో నన్ను నిజామాబాద్ కే పరిమితం చేశాను. అప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా ఏం జరుగుతుందో చూడలేదు. తెలంగాణ వచ్చాక ఏం జరిగింది. ఏం జరగలేదన్నది జనం బాట కార్యక్రమం ద్వారా తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నా. మేం చేయగలిగేవి చేస్తాం. మిగిలిన సమస్యలపై ప్రభుత్వం పై ఒత్తిడి తెస్తాం. మంచిని మంచి, చెడును చెడు అనే అంటాం. ఈ స్కూల్ ను బాగు చేశారు. బాగుందనే అంటాం. రాష్ట్రంలో ప్రతిపక్షం పట్టించుకోవటం లేదు. పాలక పక్షం అసలే పట్టించుకుంట లేదు. అందుకే జాగృతి జనం గళమై పనిచేస్తోంది.

---

# కాంగ్రెస్ ప్రభుత్వం అటో కార్మికులను మోసం చేసింది

- ఆటో డ్రైవర్లకు బాకీ ఉన్న రూ. 1,560 కోట్ల బాకీని తక్షణమే చెల్లించాలని డిమాండ్
- కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ తీవ్ర విమర్శలు
- ఆటో డ్రైవర్ల సంక్షేమానికి పోరాటం తప్పదు
- ఫిబ్రవరిలో హైదరాబాద్‌లో ఆటో డ్రైవర్ల మహా ధర్నా
- ఆటో డ్రైవర్లకు ఆత్మీయ బరోసా కార్యక్రమంలో భాగంగా ఇన్సూరెన్స్ (ప్రమాద బీమా) బాండ్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




**హైదరాబాద్, (వార్త వేదిక సూర్య):**

జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఆటో డ్రైవర్ల ఆత్మీయ భరోసా కార్యక్రమంలో భాగంగా, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) ఆటో డ్రైవర్లకు ఇన్సూరెన్స్ (ప్రమాద బీమా) బాండ్లను పంపిణీ చేశారు.




ఈ కార్యక్రమానికి జిల్లాలోని ఆటోడ్రైవర్లు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులను మోసం చేసిందని, ఆటో డ్రైవర్లకు పెండింగ్‌లో ఉన్న రూ. 1,560 కోట్ల బాకీని తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయకుంటే హైదరాబాద్‌లో మహా ధర్నాకు దిగుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఆటో అన్నలతో బిఆర్ఎస్‌కు ఉన్న అనుబంధం కొత్తది కాదని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో, కేసీఆర్ ప్రాణాలకు తెగించి ఆమరణ దీక్ష చేసినపుడు, రాష్ట్రవ్యాప్తంగా కదిలిన సబ్బండ వర్గాల్లో, ఆటో డ్రైవర్లు కూడా ముందుండి పోరాడారని, తెలంగాణ కావాలే, అయి తీరాల అని ర్యాలీలు తీసి కేసీఆర్‌కు మద్దతుగా నిలబడ్డారని గుర్తుచేశారు. వారి పాత్ర పోరాటంలో మరువలేనిదన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత కార్మికుల పట్ల తన ప్రేమను చాటుకున్నారని కేటీఆర్ తెలిపారు. కేవలం ఆటో అన్నలకే కాకుండా, రాష్ట్రంలోని సుమారు 6న్నర లక్షల నుంచి 7 లక్షల మంది ఆటో కార్మికులకు, అడగకుండానే, మ్యానిఫెస్టోలో పెట్టకుండానే, ఓట్ల కోసం దొంగమాటలు చెప్పకుండానే 5 లక్షల ప్రమాద బీమాను కల్పించారని వివరించారు.

కేటీఆర్ మాట్లాడుతూ, కేసీఆర్ రైతు బీమాను తీసుకొచ్చి ఆదర్శంగా నిలిచారని తెలిపారు. దేశంలో రైతులకు బీమా ఇచ్చిన నాయకుడు కేసీఆర్ ఒక్కడే. అలాగేడ్రైవర్లకు, గీతన్నలకు, నేతన్నలకు బీమా ఇచ్చిన నాయకుడు కార్మిక పక్షపాతి కేసీఆర్ అని పేర్కొన్నారు. ఆటో డ్రైవర్లతో పాటు, అసంఘటిత రంగంలోని దాదాపు 13న్నర లక్షల మంది డ్రైవర్లకు (వ్యాన్లు, జీపులు, ట్రాక్టర్లు, టాక్సీలు, లారీలు) కూడా 5 లక్షల ప్రమాద బీమా కల్పించిన నాయకుడు కేసీఆర్ అని గుర్తుచేశారు. సిరిసిల్ల జిల్లా కార్మిక, ధార్మిక, కర్షక క్షేత్రమని, నేతన్నలు, కర్షకులు (రైతులు), ధార్మికులు ఇక్కడ పెద్ద ఎత్తున ఉంటారని వివరించారు.

### కాంగ్రెస్ మోసపూరిత పాలన: రెండేళ్లలో కాంగ్రెస్ వైఫల్యం

రాష్ట్రంలో మార్పు, మార్పు అంటూ జరిగిన మోసం ఎలా ఉంటుందో రెండేళ్లలో ప్రజలకు అర్థమైందని కేటీఆర్ విమర్శించారు. రైతులు, యువత, మహిళలు సహా అందరినీ 420 హామీలు ఇచ్చి మోసం చేశారని. రైతు రుణమాఫీ విషయంలో అబద్ధాలు చెబుతూ, దేవుళ్లపై అబద్ధపు ఒట్లు పెడుతున్నారని దుయ్యబట్టారు. తమ ప్రభుత్వంలో మంచిగా దర్జాగా బతికిన ఆటో డ్రైవర్ ముష్రత్ అలీ, నేడు రాహుల్ గాంధీ ఇచ్చిన హామీల వల్ల రెండు ఆటోలు అమ్ముకుని, కిరాయి ఆటో నడుపుకునే పరిస్థితి వచ్చిందని తెలిపారు.

### ఆటో డ్రైవర్లకు 1,560 కోట్ల అప్పు

నెలకు రూ. 1,000 చొప్పున ఆటో డ్రైవర్లకు ఇవ్వాల్సిన మొత్తాన్ని రెండేళ్లకు లెక్క కడితే, రాష్ట్రంలోని ఆటో డ్రైవర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 1,560 కోట్లు అప్పు పడి ఉందని స్పష్టం చేశారు. ఒక్కొక్క ఆటో డ్రైవర్‌కు రెండేళ్లకు రూ. 24,000 బాకీ ఉన్నారని. ఆటో డ్రైవర్లకు బీమా కల్పిస్తే, ఈ ప్రభుత్వం దాన్ని కూడా ఊడగొట్టిందని, అందుకే గతంలో 162 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. ఇది ప్రభుత్వ హత్యే అని ఆవేదన వ్యక్తం చేశారు.

### ఆటో డ్రైవర్ల డిమాండ్: పోరాటం తప్పదు

ఆటో డ్రైవర్ల హక్కుల సాధనకు తాము అండగా ఉంటామని కేటీఆర్ హామీ ఇచ్చారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉన్న అన్ని రకాల వాహనాల డ్రైవర్లకు సంక్రాంతి లోపు బీమా కల్పిస్తామని భరోసా ఇచ్చారు. అసెంబ్లీ సమావేశాల వరకు రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు పెట్టకుంటే, ఫిబ్రవరిలో హైదరాబాద్‌లో మహా ధర్నా చేద్దామని పిలుపునిచ్చారు. "కాంగ్రెసోడు ఊరికే ఇవ్వడు. గళ్ళా పట్టి అడిగితేనే ఇస్తాడు" అని అందుకే పోరాటం తప్పదని అన్నారు. ఆత్మహత్య చేసుకున్న ఆటో డ్రైవర్ల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 10 లక్షల నష్టపరిహారం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం ఒక క్రెడిట్ సొసైటీ (కోఆపరేటివ్ సొసైటీ)గా ఏర్పడాలని వారికి సూచించారు.

---

# పోలీసు పహారా లేకుండా ఓయూకు వస్తా అని మాట తప్పారు

- మాట మీద నిలబడటం సీఎంకు చేత కాదు
- సీఎం వయస్సే 56 యేండ్లు
- 56 యేండ్ల అనుభవం తో మాట్లాడుతున్నా అంటున్నాడు.. నవ్వాలా ?ఏడవాలా ?
- సీఎం భజన బృందం లో కోదండరాం తో పాటు మరికొంత మంది చేరారు
- 2 వేల స్కూళ్ళు ఎందుకు మూత పడ్డాయో రేవంత్ రెడ్డి చెప్పాలి
- సీఎం జిల్లా పరిషత్ స్కూల్లో చదువుకున్నంత మాత్రాన అందరూ అక్కడే చదువుకోవాలా ?
- బి ఆర్ ఎస్ నేత డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్

**హైదరాబాద్:** సీఎం కు మాట తప్పడం అలవాటు. ఆగస్టు 25 నాడు ఓ యూ వచ్చినపుడు సీఎం చెప్పిందేమిటి ?ఈ రోజు ఓ యూ కు ఏ పద్దతి లో వెళ్లారు ? విద్యార్థులను అరెస్టు చేసి పోలీసు పహారా మధ్య ఈ రోజు సీఎం ఆర్ట్స్ కళాశాలకు వచ్చారు. గన్ మెన్లు లేకుండా పోలీసు పహారా లేకుండా ఓ యూ కు వస్తా అని మాట తప్పారు. మాట మీద నిలబడటం సీఎం కు చేత కాదు. గుండె నిండా అభిమానం నింపుకుని ఓ యూ కు సీఎం రాలేదు .గుండెల నిండా భయం తో కేసీఆర్ మీద విషం నింపుకుని వచ్చారు.

విద్యార్థులకు స్వేచ్ఛ ఇచ్చి ఉంటే సీఎం ఇంత స్వేచ్ఛగా మాట్లాడే వారు కాదు. సీఎం భజన బృందం లో కోదండరాం తో పాటు మరికొంత మంది చేరారు. స్వ డబ్బా ,పర డబ్బా ,పరస్పర డబ్బా తప్ప సీఎం మీటింగ్ లో ఏం లేదు. చదువుల తల్లిని కూడా సీఎం ప్రేమిస్తున్నారు అంటూ ప్రొఫెసర్లు అవమాన పరుస్తున్నారు. ఉస్మానియా కు వెయ్యి కోట్లు కేటాయిస్తున్నాం అని చెప్పి దేనికోసమో సీఎం చెప్పలేకపోయారు.

గురుకులాల్లో విద్యా వ్యవస్థను సీఎం భ్రష్టు పట్టించారు. పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నారు. ఓ యూ హాస్టళ్ల లో కూడా పురుగుల అన్నం పెడుతున్నారని విద్యార్థులు ధర్నాలు చేశారు. వాటి మీద సీఎం సమీక్ష చేశారు. దావోస్ లో అబద్దాలే. గ్లోబల్ సమిట్ లో అబద్దాలే. పెట్టుబడులు ఎన్ని తెచ్చారు అంటే మంత్రులు మమ్మల్ని దబాయిస్తున్నారు.

2 వేల స్కూళ్ళు ఎందుకు మూత పడ్డాయో రేవంత్ రెడ్డి చెప్పాలి. 25 వేల ఉపాధ్యాయుల పోస్టుల ను భర్తీ చేయాల్సి



ఉండగా సగం చేసి చేతులు. దులుపుకున్నారు. విద్యార్థులకు కడుపు నిండా భోజనం పెట్టడం చేతకాని సీఎం, ఇంటిగ్రేటెడ్ స్కూళ్ళ గురించి మాట్లాడుతున్నారు. కన్నతల్లి కి అన్నం పెట్టనోడు పినతల్లి కి బంగారు గాజులు కొనిస్తా అన్నట్టు ఉంది సీఎం తీరు.

గురుకులాల్లో అడ్మిషన్లకు డిమాండ్ తగ్గడం సీఎం అసమర్థతకు నిదర్శనం. గురుకులాల్లో విద్యార్థులు చనిపోతుంటే భాద్యుల పై చర్యలేవీ ? ఫీజు రీ ఇంబర్స్ మెంట్ ఎగ్గొట్టడమే సీఎం కు విద్యార్థుల మీద ఉన్న శ్రద్దనా ? రాష్ట్రం లో 20 వేల స్కూళ్ళు కూడా లేవు సీఎం 25 లక్షల స్కూళ్ళు అని మాట్లాడుతున్నాడు

సీఎం వయస్సే 56 యేండ్లు ..56 యేండ్ల అనుభవం తో మాట్లాడుతున్నా అంటున్నాడు .నవ్వాలా ?ఏడవాలా ? ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తా అని సీఎం మాట తప్పారు. బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు గురించి సీఎం ఎలాంటి అబద్దం చెప్పారో ఓ యూ కు వెయ్యి కోట్ల మీద అలాంటి అబద్దమే చెప్పారు. విద్యార్థులు మేల్కోవాలి. సీఎం ఎన్ని సార్లు ఓ యూ వెళ్లినా తెలంగాణ ఉద్యమం పై రైఫిల్ ఎక్కు పెట్టిన తీరును మరచిపోరు .ఆయన ఎపుడూ తెలంగాణ కు వ్యతిరేకం.

విద్యార్థులకు రాజకీయాలు అవసరం లేదు అని చెప్పి మూడు రంగుల జెండా పట్టి అనే నీ పాటను ఎందుకు వినిపించావ్ రేవంత్ రెడ్డి ? అశోక్ నగర్ లో ఉద్యోగాల కోసం రోడ్డు నెక్కిన విద్యార్థులపై లాఠీలు ఝులిపించిన ప్రభుత్వం ఇది. ఓ యూ లో కూడా కేసీఆర్ ,కే టీ ఆర్ ,హరీష్ రావు లను తిట్టడమే నీ పనా సీఎం ?

గ్లోబల్ సమ్మిట్ లో కాంగ్రెస్ నాయకులకు కోట్లు వేసి కూర్చోబెట్టారు. విందులు వినోదాలతోనే గ్లోబల్ సమిట్ ముగిసింది. ప్రజలు కోరుకుంటున్నది ఇది కాదు. తమకిచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రజలు అడుగుతున్నారు .వాటి గురించి చెప్పాలి. రైతులు ,ఆటో డ్రైవర్లు ,నేత కార్మికులు ,రిటైర్డ్ ఉద్యోగులు ,బిల్డర్లు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు .వాటి గురించి రివ్యూ చేస్తున్నారా ? ఓ యూ వెయ్యి కోట్లు ఇస్తున్నా పండగ చేసుకోండి అని సీఎం అంటున్నారు. దశ దిశా ప్రణాళిక లేని ప్రభుత్వం ఇది. పట్టపగలు రోడ్ల మీద హత్యలు జరుగుతున్నా ఈ ప్రభుత్వానికి పట్టడం లేదు.

హరీష్ రావు అడిగిన ప్రశ్నలకు మహేష్ గౌడ్ ,అద్లూరి లక్ష్మణ్ కుమార్ దగ్గర సమాధానాలు లేవు. .అందుకే పిచ్చి పిచ్చి మాటలు మాట్లాడుతున్నారు. కే టీ ఆర్ చదువు పై కూడా రేవంత్ రెడ్డి రాజకీయం చేస్తున్నారు. మరి రాజీవ్ గాంధీ ,రాహుల్ గాంధీ ఎక్కడ చదివారు ? సీఎం జిల్లా పరిషత్ స్కూల్లో చదువుకున్నంత మాత్రాన అందరూ అక్కడే చదువుకోవాలా ?

ప్రైవేటు స్కూల్లో ఇంగ్లీష్ చదువుకున్న వాళ్లంతా సీఎం దృష్టిలో మంచోళ్ళు కాదా ? పీఎం మోడీ తొలి ప్రధాని నెహ్రూ ను విమర్శిస్తే, సీఎం రేవంత్ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పైన విమర్శలు చేయడమే లక్ష్యం గా పెట్టుకున్నారు. సీఎం పిచ్చి మాటలు మాని ప్రజల హామీల పై దృష్టి పెడితే మంచిది ప్రెస్ మీట్ లో అభిలాష్ రంగినేని , దిలీప్ రెడ్డి , నాగరాజు యాదవ్, శ్రీకాంత్ ముదిరాజ్ , మోహన్ నాయక్ పాల్గొన్నారు.

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

## సినిమా నిర్మాణం ఎవరి ఇష్టం వారిదే



అన్నగారు ప్రచార కార్యక్రమంలో కార్తీ సినిమాను తెరకెక్కించడంలో ఎలాంటి రూల్స్ లేవని నటుడు కార్తి అభిప్రాయపడ్డారు. ఆయన ప్రధానపాత్రలో నటించిన చిత్రం 'అన్నగారు వస్తారు' నలన్ కుమారస్వామి దర్శకత్వం వహించగా, డిసెంబర్ 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. దీని ప్రచారంలో భాగంగా కార్తి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. సినిమాను ఇలానే తీయాలి అని రూల్స్ ఉండవు. మనకు నచ్చినట్లు ప్రేక్షకులకు నచ్చేవిధంగా తెరకెక్కించవచ్చు. ఈ విషయంలో ఎవరి వ్యక్తిగత నిర్ణయం వారిది. ఎవరికి నచ్చినట్లు వాళ్లు రూపొందిస్తారు. ఈ విషయంలో ఎవరూ ఎవరికీ నేర్పించలేరు. మనం చిన్నప్పటి నుంచి చూసిన సినిమాల ప్రభావం మనపై ఎక్కువగా ఉంటుంది. మంచి చిత్రాలు రూపొందిస్తే ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరణ చూపిస్తారు. 'అన్నగారు వస్తారు'లో మంచి ఫైటింగ్ సీన్స్ ఉన్నాయి. అవి సినిమాకే హైలైట్‌గా నిలుస్తాయని చెప్పారు. ఇక తాను ఇండస్ట్రీకి రావడానికి ముందు అమెరికాలో వర్క్ చేసినట్లు కార్తి తెలిపారు.

'నేను అమెరికాలో మూడు సంవత్సరాలు చదువుకున్నాను. అక్కడ పార్ట్‌టైమ్ ఉద్యోగం చేసి ఇక్కడకు వచ్చాను. నేను చదువు మానేసి సినిమాల్లోకి వెళ్తాను అని చెప్పగానే అక్కడి వాళ్లందరూ షాక్ అయ్యారు. నువ్వు ఇంత మంచి స్టూడెంట్‌వి సినిమాల్లోకి ఎందుకు వెళ్లడం అన్నారు. ఆ రంగానికి వెళ్లకు కెరీర్ మొత్తం పాడైపోతుంది అన్నారు. నేను ఇండస్ట్రీకి రావడానికి మా కుటుంబం చాలా సపోర్ట్ చేసింది' అని వెల్లడించారు.

## అఖండ-2 విడుదలతో పలు సినిమాలు వాయిదా



టాలీవుడ్ మాస్ యాక్షన్ జానర్‌లో భారీ అంచనాలు సెట్ చేసిన నందమూరి బాలకృష్ణ తాజా చిత్రం 'అఖండ 2: తాండవం' 12 నుంచే ప్రేక్షకుల ముందుకు రానుంది. దర్శకుడు బోయపాటి శ్రీను తెరకెక్కించిన ఈ పాన్ ఇండియా మాస్ ఎంటర్‌టైనర్ వాయిదా పడిన తర్వాత మరింత హైప్‌ను సొంతం చేసుకుంది. చివరకు డిసెంబర్ 11 రాత్రి ప్రీమియర్ షోలు, 12 నుంచి ఫుల్ ఫ్లెడ్జ్ రిలీజ్ అని అధికారికంగా ప్రకటించడంతో, ఇప్పటికే ఆ తేదీకి షెడ్యూల్ చేసుకున్న పలు చిత్రాల విడుదల తేదీలలో మార్పులు చేసుకోక తప్పలేదు. అఖండ 2 రిలీజ్ డేట్‌ను ప్రకటించే వరకు ఇతర సినిమాలన్నీ సస్పెన్స్‌లో పడిపోయాయి. అఖండ 2..డిసెంబర్ 12కా లేదంటే , క్రిస్మస్ సీజన్‌లో విడుదలవుతుందో తెలియక ఆ సమయంలో రిలీజ్‌కి సిద్ధమైన పలు సినిమాలు తమ విడుదల తేదీలను మార్చుకోవాలా లేదా అనే సందిగ్ధతలో ఉన్నాయి.

ఆ సమయంలో, బాలయ్య సినిమాపై క్లారిటీ వచ్చిన వెంటనే కొన్ని నిర్మాణ సంస్థలు తమ ప్లాన్‌లను మార్చేశాయి. డిసెంబర్ 12న రావాల్సిన రోషన్ కనకాల-సందీప్ రాజ్ కాంబినేషన్ చిత్రం 'మోగ్లీ' ఒక రోజు వెనక్కి తగ్గి డిసెంబర్ 13కి మారింది. నందు నటించిన 'సైక్ సిద్దార్థ్' అయితే ఏకంగా నూతన సంవత్సర కానుకగా జనవరి 1 న రిలీజ్‌కి సిద్ధమైంది.ఇక ఈ జాబితాలో సూపర్ స్టార్ రజినీకాంత్ చిత్రం కూడా చేరింది. రజినీకాంత్ పుట్టినరోజు సందర్భంగా తెలుగు స్టేట్స్‌లో శంకర్ దర్శకత్వంలో రూపొందిన సూపర్ హిట్ చిత్రం 'శివాజీ' ని రీరిలీజ్ చేయాలని అనుకున్నారు. కాని అఖండ 2 ప్రభావంతో ఆ చిత్రం కూడా వాయిదా పడింది. ఈ పరిణామాలు చూస్తుంటే మార్కెట్‌లో అఖండ 2 హవా ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. బాలయ్య-బోయపాటి కాంబో ఇప్పటికే బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ సృష్టించిన నేపథ్యంతో ఈ సినిమా పై అపారమైన అంచనాలు నెలకొన్నాయి. ఇప్పుడు ప్రశ్న ఒక్కటే వారం ఆలస్యంగా వస్తున్న అఖండ 2 ఈ భారీ హైప్‌ను నిలబెట్టుకుంటుందా? బాక్సాఫీస్ వద్ద అదే స్థాయి తాండవం చేస్తుందా? అన్నది మరో 24గంటల్లోనే తేలనుంది.



## వారణాసిలో యుగయుగాల చరిత్ర

### ఐదు అవతారాల్లో కనిపించనున్న మహేశ్

సూపర్ స్టార్ మహేష్ బాబు, దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి కలయికలో రూపొందుతున్న పాన్ వరల్డ్ చిత్రం 'వారణాసి' మీద ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇండియన్ సినిమా చరిత్రలోనే రికార్డు స్థాయి బ్జడెట్‌తో నిర్మాణం జరుపుకుంటున్న ఈ ప్రాజెక్ట్‌ను గ్లోబల్ ఆడియెన్స్‌కు చేరవేయాలనే లక్ష్యంతో రాజమౌళి ప్రతి ప్రమోషన్‌ను అత్యున్నత స్థాయిలో ప్లాన్ చేస్తున్నారని సమాచారం. ఇక ఇదిలా ఉంటే వారణాసికి సంబంధించిన మరో వార్త కూడా నెట్టింట వైరల్‌గా మారింది.చిత్రంలో మహేష్ ఏకంగా ఐదు అవతారాల్లో కనిపించబోతున్నాడని అంటున్నారు. సినిమాలో చాలా యుగాలు చూపించబోతున్న నేపథ్యంలో యుగానికి ఓ అవతారంలో మహేష్ కనిపిస్తాడా అని ముచ్చటించుకుంటున్నారు. గెటప్స్ ఏంటో తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే . రాజమౌళి అయితే వీటిని ఇప్పట్లో రివీల్ చేసే అవకాశం అసలు లేదు. వారణాసిలో మహేష్ రెండు లుక్స్ లో కనిపించబోతున్నారనే క్లారిటీ ఇప్పటికే ఉంది. రుద్ర అనే పాత్రతో పాటు రాముడిగా కనిపించి మహేష్ అలరించనున్నాడు.ఇదే క్రమంలో తాజాగా సోషల్ మీడియాలో వెలుగుచూసిన కొన్ని ఫోటోలు భారీ హంగామా సృష్టించాయి. లాస్ వెగాస్‌లోని ప్రపంచ ప్రసిద్ధ స్ఫియర్ బాల్‌పై 'వారణాసి' గ్లింప్స్ ప్రదర్శించారన్న న్యూస్ విపరీతంగా వైరల్ అయింది.

స్ఫియర్ బాల్‌పై మహేష్ బాబు విజువల్స్ తిరుగుతున్నట్లు కనిపించే ఆ ఫోటోలు నెట్టింట్లో వేగంగా స్ప్రెడ్ కావడంతో అందరు నిజమేనని నమ్మారు. కాని వాస్తవానికి అవి అసలు నిజం కావని తర్వాత తేలింది. ఆ ఫుటేజ్, ఫోటోలు అన్నీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో రూపొందించినవి మాత్రమే అని పరిశీలనలో బయటపడింది. దీంతో చాలామంది అభిమానులు, నెటిజన్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే స్ఫియర్ బాల్‌పై ప్రమోషన్ చేయడం అసాధ్యమేమి కాదు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ బ్రాండ్లు, సినిమాలు అక్కడ తమ కంటెంట్‌ను ప్రదర్శిస్తున్న దృష్ట్యా, సరైన మొత్తాన్ని చెల్లిస్తే 'వారణాసి' టీమ్ కూడా భవిష్యత్తులో అలాంటి గ్లోబల్ ప్రమోషన్ చేయవచ్చని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి.




## త్రివిక్రమ్-వెంకటేశ్ కాంబో

### ఆదర్శ కుటుంబం టైటిల్ ఖరారు

త్రివిక్రమ్ దర్శకత్వంలో వెంకటేశ్ కథానాయకుడిగా రూపొందుతున్న మూవీని హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టైటిల్‌ను ప్రకటించారు. ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌కు 'ఆదర్శ కుటుంబం' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. 'హౌస్ నం47 ' అనేది ఉప శీర్షిక. ఈ ప్రాజెక్ట్ ప్రకటించిన తర్వాత దీనికి సంబంధించిన ఎన్నో పేర్లు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. వాటికి చెక్ పెడుతూ ఈ టైటిల్‌ను అధికారికంగా ప్రకటించారు. అలాగే ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ బుధవారం నుంచి ప్రారంభమైనట్లు తెలుపుతూ వెంకటేశ్ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను కూడా పంచుకున్నారు. వచ్చే ఏడాది వేసవిలో దీన్ని విడుదల చేయనున్నట్లు తెలిపారు. తాజాగా పంచుకున్న ఫస్ట్‌లుక్ పోస్టర్‌లో వెంకటేశ్ సింపుల్‌లుక్‌లో మధ్యతరగతి వ్యక్తిగా ఆకట్టుకుంటున్నారు. సంచలన విజయం సాధించిన 'సంక్రాంతికి వస్తున్నాం' తర్వాత వెంకటేశ్ సోలోగా నటిస్తున్న సినిమా ఇదే. వెంకటేశ్ కథానాయకుడిగా ఇదివరకు వచ్చిన 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' సినిమాలకు త్రివిక్రమ్ స్క్రిప్ట్‌ని అందించారు.

దీంతో ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి. త్రివిక్రమ్ గత చిత్రాల్లాగే ఇందులోనూ ఇద్దరు నాయికలకు అవకాశమున్నట్లు ఇటీవల వార్తలు వచ్చాయి. ఆ పాత్రల కోసం త్రిష, నిధి అగర్వాల్‌తో పాటు రుక్మిణీ వసంత్ పేర్లు పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం బలంగా వినిపిస్తోంది. దీనితో పాటు వెంకటేశ్ వరుస సినిమాలతో అలరించేందుకు సిద్ధమయ్యారు. చిరంజీవి-అనిల్ రావిపూడి కాంబోలో రానున్న 'మన శంకర వరప్రసాద్'లో అతిథి పాత్రలో కనిపించనున్నారు. అలాగే 'దృశ్యం -3'తో మరోసారి థ్రిల్ పంచనున్నారు.




## దుమ్మురేపుతున్న ముమ్ముట్టి సినిమా

మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి నటించిన తాజా చిత్రం 'కళంకావల్' కేరళ బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టిస్తుంది. ఈ సినిమాకు జితిన్ జోస్ దర్శకత్వం వహించగా.. మమ్ముట్టి ఇందులో ప్రతినాయకుడి పాత్రలో నటించగా.. జైలర్ ఫేం వినాయకన్ కథానాయకుడిగా నటించాడు. డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం కేవలం నాలుగు రోజుల్లోనే రూ.50 కోట్లకు పైగా వసూళ్లను సాధించినట్లు చిత్రబృందం ప్రకటించింది. ఇందులో మమ్ముట్టి సైకో పాత్రలో కనిపించగా.. మమ్ముక్క నటన హైలైట్ అని ప్రేక్షకులు కామెంట్లు పెడుతున్నారు.

## ఫ్రీడమ్ ఎట్ మిడ్‌నైట్ రెండో సీజన్ రెడీ

భారత స్వాతంత్ర్య పోరాటం, దేశ విభజన నాటి చారిత్రక ఘట్టాలను కళ్లకు కట్టినట్లు చూపించిన ప్రముఖ వెబ్ సిరీస్ 'ఫ్రీడమ్ ఎట్ మిడ్‌నైట్' తన రెండో సీజన్‌తో రాబోతుంది. నిఖిల్ అద్వానీ దర్వకత్వం వహించిన ఈ వెబ్ సిరీస్ ప్రముఖ రచయితలు డొమినిక్ లాపియర్, లారీ కాలిన్స్ రాసిన ప్రసిద్ధ పుస్తకం 'ఫ్రీడమ్ ఎట్ మిడ్‌నైట్' ఆధారంగా రాబోతుంది. తాజాగా ఈ దీనికి సంబంధించిన ట్రైలర్‌తో పాటు స్ట్రీమింగ్ తేదీని చిత్రబృందం విడుదల చేసింది. రెండో సీజన్‌ని జనవరి 9 నుంచి ప్రముఖ ఓటీటీ సోనిలివ్ వేదికగా స్ట్రీమింగ్ చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. రెండో సీజన్ ట్రైలర్ చూస్తుంటే.. స్వాతంత్య్రం వచ్చిన వెంటనే దేశంలో చోటు చేసుకున్న కీలక పరిణామాలను ఈ సిరీస్ ప్రస్తావించనుంది. స్వాతంత్ర్యానంతరం భారత్ ఎదుర్కొన్న పెను సవాళ్లు, దేశాన్ని ఒకే తాటిపైకి తీసుకురావడానికి జరిగిన భారీ పోరాటంపై దృష్టి సారించింది.



ముఖ్యంగా, జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్ వంటి మహానాయకులు అప్పటికింకా భారతదేశంలో భాగంగా లేని రాచరిక సంస్థానాలను ఏ విధంగా విలీనం చేశారు. అలాగే కీలకమైన కలకత్తాను పాకిస్థాన్‌లో కలపకుండా ఎలా అడ్డుకున్నారు. చారిత్రక నగరం అయిన లాహోర్‌ని ఎలా వదులుకున్నారు అనేది ఇందులో ఆసక్తికరంగా సాగింది. మొదటి సీజన్ భారీ విజయం అందుకున్న నేపథ్యంలో దేశ నిర్మాణంలో మన నాయకులు పడిన శ్రమను తెలుసుకోవాలనుకునే చరిత్ర అభిమానుల్లో సీజన్ 2 పై భారీ అంచనాలు నెలకొన్నాయి.

Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**,and **Printed at SURYA DIGITAL PRINTERS,** H.No.132, Markondeya Nagar, Choutuppal Municipality, YadadriBhuvanagiri District, Telangana State508252., and Published at H.No. 132, Markondeya Nagar, Choutuppal Municipality, YadadriBhuvanagiri District, Telangana State508252. **Editor: POLOJU SRINIVASA CHARY. RNI No: TGTEL/25/A0305,** Cell:9985389183. **Email Id:vaarthavedhikasurya2025@gmail.com**